# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము
డి.జె. బాలకృష్ణ లాల్
డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 35 సంచిక 12
పేజీలు 40
ఆగస్ట్ 2016

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో ............................ ....... పేజీ**

భద్రవాక్యం ..........2
శ్రీబాబూజీ ఉవాచ..........3
అమ్మమాట..........6
లోకధర్మాన్ని పాటించాలి ..........8
జ్ఞాన భూమికలు..........9
యువతరానికి శ్రీమాతాజీ ఉద్బోధ..........11
శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్ కీర్తనలు..13
కృష్ణాపుష్కర కార్యక్రమములు ..........14
దురాశ..........17
శ్రీహనుమత్కాళీ ప్రసాద చూర్ణికా స్తోత్రము..........18
యోగవాశిష్ఠము ..........21
దండ దురంధరుడు-దైవభక్తుడు..........22
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు..........25
పరిప్రశ్న ..........26
సత్సంగామృతము ..........28
కృష్ణాపుష్కరాల సందర్భంగా ఆశ్రమంలోని కార్యక్రమాలలో మార్పులు..........29
అమ్మంటే అమ్మాకాదూ..........30
శ్రీకృష్ణకర్ణామృతము..........31
గీతాధ్యయనమ్ ..........33
గౌతమమహర్షి ..........35
సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర.....37
విష్ణు కథలు- సూరదాస్ ..........39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

అగ్నేనయ సుపథా రాయే అస్మాన్ విశ్వాని దేవ వయునాని విద్వాన్
యుయోధ్యస్మజ్జుహురాణ మేనః భూయిష్ఠాంతే నమ ఉక్తిం విధేమ ॥
(ఈశావాస్యోపనిషత్ - 18శ్లో॥)

'న కర్మలిప్యితే నరే' - నరుని కర్మ బంధించదు అన్న ఉపనిషత్ వాక్యం వృథాయేనా? 'నా న్యథేతోస్తి' అనేది ఇంకా దానిని విశదీకరిస్తున్నట్లు, కర్మ బంధించే అవకాశమే లేదు అన్న వాక్యం ఎంతవరకు విశ్వసించ దగినది? తత్త్వం యిలా బోధిస్తుంటే మరి మానవుడు కర్మ చేయక మానడు. కర్మబంధంలో చిక్కుకోక తప్పటం లేదు. అయితే దీనికి పరిష్కారం ఏమిటి అని విచారిస్తే, ఈశావాస్య తత్త్వంతో జీవితాన్ని సమన్వయం చేసుకుని జీవించేవారికి సాధన పరంగా కర్మలు ఆచరించే వారికి, వ్యావహారిక కర్మలకు దూరంగా మసలుకునే వారికి కర్మ బంధించదు యదార్థమే.

బోధకు విరుద్ధంగా జీవించే మానవుడు తన జీవిత ధ్యేయాన్ని గుర్తించి విచారణ చేసి, తత్త్వ విరుద్ధమైన దోషాన్ని తెలుసుకుని, పశ్చాత్తాపంతో తన ధ్యేయాన్ని సవరించుకునే అవకాశాన్ని తెలియజేస్తోంది ఈ శ్లోకము. కర్మ బంధనకు గురికాకుండా తన సాధన ద్వారా వుద్భవించే జ్ఞానాగ్ని ప్రేరణ చేసి కర్మని రహితం చేసుకోవచ్చు. తన మనస్సును అంతర్ముఖం చేసి, సాధన పరంగా కాకుండా, వ్యావహారికంగా ఆచరించిన కర్మలు, ఇంద్రియ భోగాలను దగ్ధం చేసి, తనలో జ్ఞాన ప్రకాశము స్థిరంగా నిలచి ఉండాలని ధ్యానించు, ప్రార్థించు, పరితపించు. అగ్నిలో దూకి దగ్ధం కాకుండా ఉండాలన్నా, సముద్రంలో దూకి మునిగిపోకుండా ఉండాలన్నా సాధ్యపడదు కదా. కనుక సాధ్యాసాధ్యముల విచారణ చేత మనస్సుని స్వాధీనపరచుకుని, తత్త్వపరంగా, సాధనా పరంగా మనస్సును మరల్చి సర్వవ్యాపకమై నీలోనూ ప్రకాశించే తేజస్సును ఆశ్రయించు. తప్పక కర్మరహితం కాక మానదు సుమా! అగ్నికి ఆహుతి కాక మానదు.

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

"మహాత్ములందరూ సమానమేకదా? ఎవరినిబడితే వారిని దర్శించి వారి బోధ వినవచ్చునా? సత్యగురువును మాత్రమే ఆశ్రయించమంటున్నారు కదా! వారిని ఎలా గుర్తించాలి?" అని సందేహాలు వెలిబుచ్చిన సందర్భంగా శ్రీ బాబూజీ మహరాజ్ బోధచేస్తూ "ఏ దేశానికి చెందినవారైనా, ఏ మతానికి చెందినవారైనా, ఏ కులానికి చెందినవారైనా వారి గోత్రం ఏదైనా, భగవంతుడు ఉన్నాడు అని నమ్ముతారు కదా. దైవశక్తి మహత్తరమైనది. అన్నింటికీ మించినది. అతీతమైనది. అది సర్వత్రా వ్యాప్తమై సర్వసృష్టికీ ఆధారమైనది. దైవం అంటే నమ్మకంలేని కొంతమంది వ్యక్తులు వారు చదువుకున్న వారైనా, చదువుకోని వారైనా, శాస్త్రజ్ఞులైనా కూడా అన్నింటికీ ఆధారమైన ఏదో మహత్తర శక్తి ఉందని నమ్ముతారు. దానిని దైవం అని అంగీకరించడానికి మాత్రం వారి పాండిత్యము, వారి శాస్త్ర జ్ఞానము అడ్డుపడుతుంది. వేదాలు వల్లించినంతమాత్రాన పండితులౌతారా? గ్రంథపఠనం ద్వారా పాండిత్యం వస్తుందా? నిజమైన పండితుడంటే ఎవరు? కామ క్రోధాది గుణాలని నిగ్రహించగలిగినవాడే నిజమైన పండితుడని మన గీతాచార్యుడే భగవద్గీతలో జ్ఞాన యోగంలో బోధించాడు కదా! జ్ఞాన సంపన్నుడే నిజమైన పండితుడు. తన నిజస్థితి ఏమిటో తెలుసుకొనుటయే జ్ఞానము.



అలా తెలుసుకున్నవాడే జ్ఞాని. జ్ఞానము తరిగేదికాదు. జ్ఞానికి కీర్తి వ్యామోహం గాని, ధనవ్యామోహం గాని, దారాపుత్రాదులపై వ్యామోహంగాని, కామ వాంఛగాని ఉండవు. వేమన చూడండి మొదట్లో కాముకుడే కాని సరియైన సమయంలో సాధు సందర్శన స్పర్శ, సంభాషణ ద్వారా భక్తి కాముకుడై ఈ నాటికీ ప్రకాశిస్తున్నాడు. ధన వ్యామోహం చాలా చెడ్డది. అది ఉన్నవారు ఏపని చేయడానికైనా సిద్ధపడతారు. అసత్యము ఆడడానికి వెనుదీయరు. ఎవరి పాదస్పర్శచేత

ఎటువంటి గుణహీనుడైనా సంస్కరింపబడతాడో వారే సత్యగురువు. అయితే సత్యగురువులను గుర్తించడం అంత తేలికైన పనికాదు. నిజమైన దైవభక్తి, తత్పరత, ఆవేదన గల సాధకులకి దైవమే యాదృచ్ఛికంగా సత్యగురువుల దర్శన భాగ్యం కలిగేలా చేస్తుంది. మహాత్ములెవరైనా తాము తరించడమేగాక తమను ఆశ్రయించిన వారినెవరినైనా తరింపజేయగల సమర్థులే. ఇక్కడ మీకొక దృష్టాంతము చెబుతాను. ఒక ఇంటి ఇల్లాలుందనుకోండి. ఆమె హృదయంలో భర్తకి పవిత్రమైన స్థానం ఇస్తుంది. ఆమె ఇంటికి వచ్చిన అతిథుల నెంతమందినైనా గౌరవిస్తుంది. వారికి సకల మర్యాదలూ చేస్తుంది. అయితే ఎంతవరకు? వారికి తన భర్తకిచ్చిన స్థానం ఇవ్వగలుగుతుందా? ఆమె హృదయంలో ఇంకెవ్వరికీ స్థానం ఉండదుగదా?

అలాగే సాధకుడైన భక్తుడు తన మనస్సును ఏకైక గురులక్ష్యార్థము పైననే ఉంచాలి. మహాత్ములనెందరినైనా దర్శించవచ్చు. దివ్య క్షేత్రాలు ఎన్నైనా చూడవచ్చు. సర్వే సర్వత్రా తామాశ్రయించిన గురుమూర్తినే దర్శించాలి. దానికి భిన్నంగా మనస్సు చలిస్తే దానిని వ్యభిచార భక్తి అంటారు. రాధాకృష్ణుల ప్రేమకి పండితులు వక్రభాష్యం చెప్పారు. అటువంటి విపరీత భావాలు వారికెందుకు కలిగాయి? వారి మనస్సు చెదిరితేనాగా! రాధాకృష్ణులు ప్రకృతి, పురుషుడు అనే ఉన్నత భావన కలిగి మనస్సు భగవంతుని యందు నిలిచినవారికి వారి రచనలలో నీచభావాలు దొర్లుతాయా? పోతనగారి రచనలలో అటువంటి భావాలు ఎక్కడైనా దొర్లాయా? సృష్టికర్త, భర్త, హర్త అయిన భగవంతుని గురించి చేసే రచనలలో విపరీతభావాలు దొర్లితే అది పాండిత్యం అనిపించుకుంటుందా? భగవంతుని ఆశ్రయించిన భక్తులకుగాని, భగవంతుని సేవకులను సేవించేవారికి గాని భగవంతుని సేవించినంత ఫలము అని రచనలు చేసిన వారి భావము ఎంత ఉన్నతమైనది? ఏది నిజమైనపాండిత్యమో మీరే చెప్పండి? అని అన్నారు.

ఇంకా మాట్లాడుతూ నడిసముద్రములో నావలో ప్రయాణించే వారికి గమ్యస్థానానికి చేర్చటానికి దిక్సూచి ఎలా తోడ్పడుతుందో అలాగే సంసార సాగరంలో మునిగియున్న మానవుడు బ్రహ్మచారియైనా,

గృహస్థు అయినా, వానప్రస్థాశ్రమంలో ఉన్నా గురులక్ష్యార్థమును ఏకాగ్ర మనస్సుతో ధ్యానించినపుడే గురుకృప వర్షించి తన నిజస్థితిని తెలుసుకోగల్గుతాడు. మానవులు వివేకవంతులు, భక్తులు, అవివేకులు అని మూడు రకములుగా ఉంటారు. వివేకవంతులు లేక జ్ఞానుల మనస్సు ఆత్మలో లయమై ఆత్మానందములో ఓలలాడుతూ ఉంటుంది. భక్తుల మనస్సు భగవంతుని అనుభూతి పొందుతూ ఉంటుంది. అవివేకుని మనస్సులో భగవంతుని దృష్టి ఉండదు. ప్రాపంచిక విషయాదుల యందు ఆసక్తి కలిగి ఉంటుంది. అవివేకులకి మహాత్ములు ఎంత బోధించినా ఏమి లాభం? "హీనుడవగుణంబు మానునా? బొగ్గు పాలకడుగ పోవునా మలినంబు?" అటువంటి మూర్ఖుడు గురుపాద తీర్థము పుచ్చుకోకుండా తప్పించుకుంటాడు. పుచ్చుకున్నా దానిని తిరస్కరించి పారబోస్తాడు. ప్రకృతికి తలవంచుతాడుగానీ, పరమాత్మకి తలవంచడు. ఇక్కడ మీకొక దృష్టాంతము చెబుతాను.

ఒక గురువుగారు శిష్యుడ్ని దీపం వెలిగించమన్నారు. శిష్యుడు దీపం వెలిగించడానికి ప్రయత్నం చేశాడు. ఫ్యాను గాలికి, కిటికీ ద్వారా వచ్చేగాలికి ఆ దీపం వెలగలేదు. కిటికీ తలుపులు మూయాలన్న, ఫ్యాను ఆపాలన్న వివేకాన్ని కోల్పోయాడు. అది చూసి గురువుగారు మాట్లాడుతూ 'ఏమిటయ్యా? దీపం వెలగటం లేదా? అని ప్రశ్నించారు. శిష్యుడు సమాధానం చెబుతూ 'అగ్గి పెట్టెలో పుల్లలకి మందు సరిగాలేదు' అని అంటాడు. వెంటనే గురువు గారు లేచివచ్చి కిటికీ తలుపులు మూసి, ఫ్యాను ఆపి అగ్గిపుల్లతో దీపం వెలిగించారు. చూశారా! అవివేకుడి మనస్సు గాలిలో దీపం వలె రెప రెప లాడుతూ ఉంటుంది. నిలబడదు. అది ఒక కోతి లాంటిది. అదిలేని దానిని ఉన్నట్లుగా, ఉన్నదానిని లేనట్లుగా భావన కలుగజేస్తుంది. అదే మాయ" అన్నారు.

(గత సంచిక తరువాయి) **అమ్మ మాట** - జపమాల ప్రసాద

# నిర్మల హృదయ విరాజిత చరణం

మీకు కాని విషయాలు ఆలోచించవద్దు. మనస్సు ఆలోచిస్తుంది. కానీ దేనిని గురించి ఆలోచించాలో నీవే నిర్ణయించుకో. నీకు సినిమాల గురించి ఆలోచించాలని వుంటే అలాగే చెయ్యి. కథల వెమ్మట పరుగులు పెట్టకు. ఎన్ని సినిమాలు చూస్తే నీకు తృప్తి వస్తుంది? ఆ కథ కూడా మన కథ లాంటిదే. ప్రహ్లాదుడి సినిమాయే చూశాము అనుకోండి. మనం ప్రహ్లాదుడి వైపే తీసుకుంటాం గాని మనం హిరణ్య కశిపుడి పక్షం కాదుకదా. ఆ సినిమా



ఎన్నిసార్లు చూస్తే మనం ప్రహ్లాదుడిలాగ అవుతాము? అసలు ప్రహ్లాదుడి లక్షణం ఏమిటి? గురువాక్యపరిపాలన. ఆయన తల్లి గర్భంలో నుండే అది ఆచరణలో పెట్టాడు. నిదురలో కూడా దానిని మించినది ఏదో వున్నదని అతడు అనుకోలేదు.

నిరంతరం అహర్నిశలూ ఓం నమో నారాయణాయ అనే మంత్రం తప్ప వేరేదీ పలుకలేదాయన. తన తండ్రి చెప్పినట్లు చేయకుండా, అలా చేయటం సబబేనా అని ఒక భక్తుడు శ్రీబాబూజీమహరాజ్‌ను అడిగితే, స్వామి "మాతృదేవో భవ, పితృదేవో భవ - అన్నమాట నిజమే. కానీ ఆ తరువాత ఆచార్యదేవోభవ అన్నారు. తన తల్లిదండ్రులని చూడక పూర్వమే ప్రహ్లాదుడు తల్లిగర్భంలో ఉండగానే, గురుదేవుడైన నారదుని మాట విన్నాడు. గర్భస్థ శిశువుగా వుండగానే గురూపదేశం అయింది. తన లక్ష్యార్థాన్ని నిదురలో కూడా విడిచిపెట్టలేదు. గురువాక్యాన్ని అమలు పరచాడేమో తద్వారా తన తండ్రి కూడా ఉద్ధరింపబడ్డాడు" అన్నారు శ్రీబాబు.

ఎంతమంది భక్తులతో మనం సహవాసం చేయాలి? ఒక్క భక్తుడితో చేస్తే చాలు మనకి. వారిని వదలిపెట్టకూడదు. మనం అవసరార్థ భక్తులం అవకూడదు. స్కందోపనిషత్తు ఒక సాధకుడు ఆచరించవలసిన విధులన్నీ ఎంతో చక్కగా వివరించింది. సాధకుడు రుచులను కోరకూడదు. 'బ్రహ్మామృతమ్ పిబేత్। భైక్ష్యమాచరేత్ దేహ రక్షణే।' అంటోంది ఉపనిషత్. నిరంతరం బ్రహ్మామృతాన్ని పానం చేయి. నీ దేహ రక్షణ కోసం భిక్షను స్వీకరించు. మనస్సు కోరినవన్నీ తింటే భుక్తాయాసం, అతి నిద్ర. ఆకలి వేసిన కడుపు రుచిని కోరదు. రుచిని, పదార్థాన్ని కోరే మనస్సు ఆకలిని తీర్చలేదు. ఇది ప్రతి సాధకుడు గుర్తుపెట్టుకోవాలి.

శ్రీగురుదేవులు మనకి అన్ని పుష్కలంగా యిస్తూ మనలను గారం చేస్తున్నారేమో అనిపిస్తుంది. కాని వారు చెప్పిన ముఖ్యమైన విషయం ఒకటున్నది. అది ఎవరి సాధన వారే చేసుకోవాలి. మనకి మనం శిక్షణ యిచ్చుకోకపోతే, ఇంకొకరిస్తే వినే రోజులు పోయాయి. అంతెందుకు, 'నువ్వు ఫలానా తప్పు చదివావు' అన్నామంటే, ఇంక అంతే. వారు చెప్పే కారణాలకి, చేసే వాదనలకి మన మనశ్శాంతి పాడైపోతుంది. దాని వలన మన సాధన భంగమైపోతుంది. కనుక ఎవరి లక్షణాలు వారికే వదిలివేస్తే సరిపోతుంది కదా! అనవసరంగా మన తలకి చుట్టించుకోవటం ఎందుకు? భగవంతుడిని కొలవటం చాలా తేలిక. ఆయన అనురాగ పూర్ణుడు. ఆయన అందరి సొత్తు. ఆయన మననేమీ అడగడు. కానీ ఆ దివ్యమైన ఆనందంలో ఓలలాడుతున్నా కూడా, బయట ప్రపంచంలోకి రావటం తప్పటం లేదు. బయటకు వచ్చి ఏదైనా సర్దుదాం అనుకున్నా కూడా అర్థం చేసుకుని ఆచరించే జీవులెంతమంది? భోజనం చేయటం, వంటలు వండటం, లోకాభిరామాయణం, పాలిటిక్స్ తెలిసినంతగా భగవంతుడి గురించి, ఆధ్యాత్మిక శిక్షణ గురించి తెలియటం లేదు. తెలుసుకోవాలని ప్రయత్నం చేసేవారు ఏ కొందరో! ఎప్పటికి భగవంతుణ్ణి తెలుసుకుంటారు. జీవితాలు అయిపోతున్నాయి. ఎవరు ఎన్నాళ్ళుంటాం?

- సశేషం

# లోకధర్మాన్ని పాటించాలి

- బులుసు వెంకటరమణయ్య

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం శ్రీహరి ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడుగా అవతరించి తన ధర్మాన్ని నెరవేర్చుకున్నాడు.

కౌరవులకూ పాండవులకు పరస్పర విద్వేషం పెరిగి, మహా యుద్ధం సంభవించినప్పుడు తాను రాయబారం వహించి యుద్ధాన్ని నిలిపి వేయడానికి ఎంతో ప్రయత్నం చేశాడనీ, మరి యాదవ కులంలో ముసలం పుట్టి, దానిద్వారా తన వారందరూ నశిస్తున్నప్పుడు శ్రీకృష్ణుడు తటస్థంగా ఉండిపోయాడనీ, ఇట్టి వ్యత్యాస భావం కృష్ణుడికి ఎందుకు కలిగిందనీ కొందరికి సందేహం కలగటం సహజమే!

యుద్ధం జరిగితేనేగాని దుష్టనాశనం సాధ్యంకాదు కాబట్టి యుద్ధం జరుగవలసినదే అనీ, అది అనివార్యమని శ్రీకృష్ణునికి తెలుసు. అయినా అతను సంధికోసం రాయబారం నడపటం కేవలం లోక ధర్మాన్ని పాటించటానికే!

అతడు సాక్షాత్తు భగవంతుడే అని విజ్ఞులు భావించినా, అజ్ఞులు అతనిని సామాన్య మానవుడే అనుకున్నారు. ఇట్టి పరిస్థితులలో ప్రజలకు తనపై సదభిప్రాయం కలగటానికి ఆయన కౌరవపాండవులకు మధ్య సంధి కుదర్చటమే ఉత్తమమైన మార్గం. సంధి కుదరదని ఎరిగి కూడా ఆయన యత్నించినది కేవలం లోకధర్మాన్ని పాటించటానికే!

అయితే ఈ ప్రయత్నం తన వారి విషయంలో ఎందుకు చెయ్యకూడదు? అంటే - దానికి సమాధానం లేకపోలేదు.

మహర్షుల శాపకారణంగా యాదవుల నాశనం తప్పదని శ్రీ కృష్ణునికి బాగా తెలుసు. మునులను అవమానించటంలో తన సంతానం ప్రధానపాత్ర వహించింది. అందువలన ఏమి చెయ్యటానికి సాధ్యం కాని పరిస్థితి ఏర్పడింది. అయినా పూర్తిగా ఉపేక్షించలేదు. పుట్టిన ముసలాన్ని పూర్తిగా అరగదీయాలని చెప్పి, అలా చేయించాడు. చివరకు మిగిలి పోయిన మలికివంటి భాగమే ఆయన అవతారపరిసమాప్తికి కారణమైంది. మరి శ్రీకృష్ణుడూ యాదవ వంశంలోనివాడే కదా!

ఆయన భగవంతుడే అయినా మానవుడిగా అవతరించి నందుకు మానవ ధర్మాలను పాటించక తప్పదు.

# జ్ఞాన భూమికలు

- పరాశర ప్రసాద్

విషయాదులతో విలీనమైన మనస్సును వాటి నుంచి వేరు చేయటం కష్టం. పోనీ మనస్సుని తొలగిద్దామా! మనస్సుని తొలగించటం అసాధ్యం. మనస్సులో వికారాలను తొలగించాలి. అది సాధించే మార్గమే సాధన. నేర్పరితనంతో మనస్సుకి పూజ, అర్చన, ఉపాసన, పారాయణ కార్యక్రమాలలో ప్రవేశం కల్పించాలి. ఉపాధి అనే మాయచేత సత్యమార్గం గుర్తించకుండా అడ్డుపడుతోంది.

మనస్సుకి ఆహారం బోధ. కాని విషయాదులచేత మోహింపబడి సత్యమార్గం తెలుసుకోలేక పోతోంది. సాధనకి అవరోధం ఇంద్రియాలు కాదు. పురుష ప్రయత్న లోపము. పురుష ప్రయత్నం చేయాలంటే ఆసక్తి కలగాలి. ఆసక్తి కలగటానికి బీజము సత్సంగము. విషయాదులంటే తినటం, త్రాగటము, నిదురించటము కాదు. మనస్సు ద్వారా చేసే భావనలు, చింతనలు.

సాధకుడు జ్ఞాన మార్గంలో పయనించటం అంటే శ్రేయస్సు అనే సౌధాన్ని ఆరోహణ చేయటం అన్నమాట. ఆ సౌధాన్ని ఆరోహణ చేయటానికి ఏడు మెట్లు ఎక్కాలి. అవే జ్ఞానభూమికలు. -1 శుభేచ్ఛ, 2. విచారణ, 3 తనుమానసి, 4 సత్వపత్తి, 5 అసంశక్తి, 6 పదార్థభావన 7 తురీయం.

తత్వం తెలుసుకోవాలనే ఇచ్ఛ కలగటమే శుభేచ్ఛ. శుభేచ్ఛ కలగటానికి మూలం సత్సంగం. దాని ద్వారా సద్గురుమూర్తి సమాశ్రయం కలుగుతుంది. ఆ క్షణమే పరమ శ్రేయస్సు అనే సౌధాన్ని చేరటానికి ప్రయత్నిస్తావు. ఆ ప్రయత్నంలో భాగమే విచారణ. వివేకవంతమైన ఆలోచన. అదే నిత్యానిత్య విచారణ. ఆ విచారణ ద్వారా విషయానురక్తి నశిస్తుంది.

విషయానురక్తి నశించటమే తనుమానసి. సాధకుడు ఆ స్థితిలో ఆత్మానందం చవిచూడాలనే గాఢ ఆకాంక్ష పెంపొందించుకుంటాడు. దానిని సాధించటానికి విషయాదుల యందు విముఖత కలిగి, విరాగియై సాధన యందు దృష్టి నిలపటమే సత్వపత్తి అనవచ్చు.

సాధకుడు క్రమేపి తన సాధనా మార్గంలో పురోగతిని సాధిస్తూ

ఆశామోహాలకు దూరమై సాధ్యమైనంత వరకు సాత్విక ప్రవర్తన కలిగి వుంటాడు. ఆ స్థితిలో తాను నిర్వహించవలసిన కార్యములను నిమిత్త మాత్రంగా నిర్వహిస్తూ కర్తృత్వ భావనకి దూరం అవుతాడు. విషయాదులకు దూరమైన మనస్సు అంతర్ముఖమై ఆత్మవస్తువు యందే రమత చెందుతుంది. పదార్థ భావన దాటిన మరుక్షణమే తురీయస్థితిలో ఆనందాబ్ధిలో ఓలలాడుతాడు. పరమ శ్రేయస్సు అనే సౌధాన్ని చేరుకున్న తరువాత పునర్జన్మ ఉంటుందా! అసంభవం!!

---



శ్రీకాళీప్రసాద స్వచ్ఛంద సేవా సంస్థ
కర్నూలు వారిచే
పాములపాడుమండలం,
వేంపెంట గ్రామంలో
నిర్వహించిన
ఉచిత వైద్య శిబిరం

శ్రీకాళీప్రసాద స్వచ్ఛంద సేవా సంస్థ
కర్నూలు వారిచే
ఆత్మకూరు మండలం వడ్ల రామాపురం గ్రామంలో
నిర్వహించిన
ఉచిత పుస్తకాల పంపిణీ



# యువతరానికి శ్రీమాతాజీ ఉద్బోధ

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

ఆధ్యాత్మిక సాధకుడు పట్టుదలతో, భక్తితో ఏ మంత్రం జపించినా, ఏ పూజా విధానం అవలంబించినా, అది సత్ఫలితాన్ని తప్పకుండా పొందుతాడు. మంత్రం అంటే?- మననాత్ త్రాయతి ఇతి మంత్రః మానసికంగా, శ్రద్ధా భక్తులతో నిర్విరామంగా మంత్రాన్ని జపిస్తే జనన మరణాది విషవలయంనుండి బయట పడతాడు. ఎంత సేపు చేసామన్నది కాదు ముఖ్యం. ఎంతసేపు మనసును మరచి చేయటమన్నది ముఖ్యం. గాఢమైన భక్తి విశ్వాసాలు లేని వాడు ఎంత పండితుడైనా, భగవంతుడి కృపకు పాత్రుడు కాలేడు. భగవద్దర్శనం పొందలేడు. కాని అట్టివాడు కూడా సజ్జన సాంగత్యం ద్వారా , భగవద్దర్శనం పొందిన భక్తుల ద్వారా, ఆత్మానుభూతిని పొందిన సద్గురువులద్వారా, తరించగలడు. దీనిని నిరూపించే కథే శ్రీ బాబూజీ మహరాజ్ వారు చెప్పిన గొల్ల వెంకన్న కథ.



ఈ కథలోని ముఖ్యాంశాలు : ఒక శాస్త్ర విశారదుడు భగవద్దర్శనానికి చాలా ప్రయత్నించాడు. కాని అతడి మనస్సు భౌతిక విషయాలపై వుండటం వలన అతడికి ఆధ్యాత్మిక పురోగతి లభించలేదు. ధన సంపాదనకోసం ఆ దేశపు రాజును దర్శించటానికి వెళ్తూ, ఎండలో నడచి అలసిపోయి ఆకలిగొన్న అతనికి వెంకన్న అనే గొల్ల పిల్లవాడు ఆయనకు ఒక దొన్నె నిండా మేకపాలు పిండి ఇస్తాడు. ఆ పాలు తీసికొని పండితుడు సంతోషిస్తాడు. అప్పుడు ఆ బాలుడు, “ అయ్యా! మీరు తప్పకుండా దేవుడిని చూసే ఉంటారు. నేను దేవుడిని చూడగలిగే మంత్రాన్ని నాకు ఉపదేశించండి” అంటాడు. పండితుడు అతడికి కల్లబొల్లి మాటలతో అల్లిన,“ఓ బొల్లిగద్దనెక్కిన నల్లనయ్యా! వైకుంఠనాథా!త్వరగా వచ్చి ఈ పాయసం ఆరగించి పోవయ్యా!” అనే మంత్రాన్ని ఉపదేశించి, “వెంకన్నా! ఇదే మంత్రం. దీనిని ప్రతిరోజూ, స్నానం చేసి, పాయసం తయారు చేసికొని ఈ మంత్రం జపించు. ఆ పాయసాన్ని దేవుడికి నివేదన చేసి ఆ మహా ప్రసాదం నువ్వు తీసుకో. తరిస్తావు” అని వెళ్ళిపోతాడు. ఆ మర్నాడు పాయసం తయారు చేసికొని ఆ నల్లనయ్యకోసం ఆకాశంలో దృష్టి నిలిపి, శరీర స్మృతి లేకుండా అదే ధ్యాసలో ఉన్న అతడిని కరుణించి

వైకుంఠనాథుడు దర్శనమిచ్చి పాయసాన్ని తాను తిని వెంకన్నకు తినిపిస్తాడు. ఈ కార్యక్రమం రోజూ సాగిపోతూ ఉంటుంది. ఒకరోజున తిరుగు ప్రయాణమై వస్తున్న పండితుడు కనిపిస్తాడు. ఆనందంతో ఆయన పాదాలపై వ్రాలి,"గురుదేవా! తమ కృపచే వైకుంఠనాథుని దర్శన భాగ్యం అయింది" అని జరిగినంతా చెప్పాడు. ఆ మర్నాడు చెట్టుచాటునుండి వైకుంఠనాథుడు రావటం, వచ్చి పాయసం స్వీకరించి వెళ్లటం గమనించాడు. వెంకన్న పండితునితో," స్వామీ! మీరు వైకుంఠనాథుని దర్శించారా?" అని అడిగాడు. అవునుగాని నువ్వు వైకుంఠనాథునితో ఏమి మాట్లాడావు? నాకు సరిగా వినిపించలేదు". అన్నాడు. "స్వామీ! స్వామికి నాపైన సంపూర్ణ అనుగ్రహం కలిగింది. రేపు గరుడ వాహనంలో వచ్చి నన్ను వైకుంఠానికి తీసుకు వెడతానని చెప్పాడు" అన్నాడు. ఆ పండితుడు,"నాయనా! నేను చెప్పిన మంత్రాన్ని శ్రద్ధగా అనుష్ఠానంచేసి వైకుంఠనాథుని అనుగ్రహానికి పాత్రుడవైనావు. నాదొక చిన్న కోరిక. రేపు స్వామి నిన్ను గరుడ వాహనంపైన కూర్చోబెట్టుకొన్నప్పుడు నీవు నీ పాదాలను క్రిందకు వదలి కూర్చో. నేను వచ్చి నీ పాదాలను గట్టిగా పట్టుకొంటాను. స్వామితో నేను నీ గురువునని, నన్నుకూడా వైకుంఠానికి తీసుకు వెళ్లమని ప్రార్థించు. అలా అయితేనే వస్తానని పట్టుబట్టు" అన్నాడు. వెంకన్న,"స్వామీ! మీ ఆజ్ఞ నాకు శిరోధార్యం" అన్నాడు. ఆ మర్నాడు గరుడ వాహనం పైకి లేస్తున్న సమయంలో పండితుడు వెంకన్న పాదాలను గట్టిగా పట్టుకొన్నాడు. గాలిలో వ్రేలాడుతున్న పండితుని చూసి వైకుంఠనాథుడు, "వెంకన్నా! ఎవరీతడు?" అని అడుగగా,"స్వామీ! వీరు నా గురుదేవులు. వీరు దయతో ఉపదేశించిన మంత్ర ప్రభావం వలననేనాకు తమ నిత్య దర్శన భాగ్యమూ, ఈనాడు ఈ భాగ్యమూ లభించాయి" అన్నాడు. వైకుంఠనాథుడు, " ఎంత అమాయకుడవోయీ! ఈ పండితుడు దురంహంకారి. ఇతడు తన పాండిత్యాన్ని స్వప్రయోజనాలకే వినియోగించాడు. తనలో స్వయంప్రకాశమై ఉన్న ఆత్మ వస్తువును తెలుసుకోవటానికి ఎన్నడూ వినియోగించలేదు. నీకు అతడు ఉపదేశించినది అసలు మంత్రం కానే కాదు. అయినా నీవు దానిని నిర్మల హృదయంతో, తీవ్రనిష్ఠతో అచంచల విశ్వాసంతో జపించటం వలన ఆ మాయమంత్రమే మహామంత్రమైంది. ఇది కేవలం నీభక్తి శక్తియేగాని అతడు నీకు చేసిన ఉపకారం ఏదీ లేదు. ఇతడికి నరకంలో అధమాధమస్థానం లభిస్తుంది." అన్నాడు.

-సశేషం



## శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్ కీర్తనలు

నటరాజేశ్వర । సదాశివా ।
నమో భూత గణనాథ । భవా॥ ॥నట॥

1. జయ శివ శంకర, శశాంక శేఖర
చిదంబరేశ్వర । శ్రీకామేశ్వర ॥నట॥

2 గిరిజావర । హర । పరమ దయాకర ।
మృగ చర్మాంబర । జగదాధారా । ॥నట॥

---

పరమ శివా కరుణాకరా ।
మాం పాహి మహేశ్వరా ।
హర శంభో చంద్రశేఖరా ।
పరమేశా పరాత్పరా ।
వరదా గిరిజా మనోహరా ।
మాం పాహి మహేశ్వరా । ॥పరమ॥

1. ఫాల లోచనా । భవహారీ ।
కాలకాల । ఖలజనవైరీ ।
ఢమరుక ధారీ । త్రిపుర విదారీ ।
అమర వినుత । సంకట హారీ । ॥పరమ॥

2 పన్నగ భూషణ । భవా । భవా।
ధీ సన్నుత చరణా । సదాశివా ।
పాలిత కింకర । భక్తవశంకర ।
భోలా శంకర నమో నమో । ॥పరమ॥

# కృష్ణా పుష్కర కార్యక్రమములు

12-8-2016 శుక్రవారం నుండి 24-8-2016 బుధవారం వరకు
ఓం సమర్థ సద్గురు వాసవి అమరేశ్వర కృష్ణాపుష్కర మహాయాగము

శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారి దివ్య ఆశీస్సులతో, గుంటూరు జిల్లా, అమరావతిలో, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయ ప్రాంగణములో (శ్రీ అమరలింగేశ్వర స్వామి వారి ఆలయము ఎదుట రథశాల ప్రక్కన) నిర్వహించుటకు నిర్ణయించటమైనది. ఓం సమర్థ సద్గురు వాసవి అమరేశ్వర కృష్ణా పుష్కర మహాయాగము, అన్నదాన సహిత సత్సంగ సమావేశములు, అఖండ హరినామ సంకీర్తన, సామూహిక పూజలు, మరియు ఉచిత వైద్య శిబిరము నిర్వహింప బడును. భక్త మహాశయులందరూ అన్ని కార్యక్రమములలో పాల్గొని యీ సదవకాశమును వినియోగించు కొనగలరని, శ్రీ అమర లింగేశ్వర స్వామి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవార్ల దర్శనం చేసుకుని వారి కృపను, శ్రీ సద్గురుదేవుల అనుగ్రహమును పొందగలరని ఆశిస్తున్నాము.

12-8-2016 శుక్రవారం నుండి 24-8-2016 బుధవారం వరకు ఆశ్రమ ప్రధానకేంద్రమునకు (శ్రీకాళీ వన ఆశ్రమము, నంబూరు) విచ్చేయు పుష్కర యాత్రికులకు ఉచిత వసతి, మహాప్రసాదము ఏర్పాటు చేయబడినవి.

కార్యక్రమ వివరములు

నిత్య కార్య క్రమములు -

తెల్లవారుజామున 3గం. నుండి 4గం. వరకు పుష్కర స్నానము.

తె.జా 4గం. నుండి 4-30ని॥ల వరకు మేలుకొలుపు, సుప్రభాతము

తె.జా 4-30ని॥ల నుండి 6గం. ల వరకు ధ్యానము, ప్రార్థన, హారతి.

ఉదయం 6గం. నుండి భోగ ప్రసాద వితరణ.

ఉ. 8గం. నుండి 10గం. వరకు నిత్య పూజలు.

ఉ. 9గం. నుండి మ. 1గం. వరకు; మ. 3గం. నుండి సా. 5గం. వరకు ఉచిత వైద్య శిబిరము.

ఉ. 10గం. నుండి పుష్కర యాత్రికులకు మహా ప్రసాదము.(అన్నదానం)

ఉ. 10గం. నుండి 11-30ని॥ల వరకు శ్రీనివాసరామానుజదాస్‌గారి ప్రవచనము. (భాగవత భక్తుల కథలు)

ఉ. 11-30గం. నుండి 12-30 శ్రీమాతాజీ మరియు మహాత్ముల ప్రవచనములు.

మ.3-30ని॥ల నుండి సా.5గం. వరకు శ్రీసద్గురు మూలమంత్ర హోమం.

సా. 5గం.నుండి 6-30ని॥ల వరకు శ్రీనివాసరామానుజదాస్‌గారి ప్రవచనము. (భాగవత భక్తుల కథలు)

సా. 6-30ని॥ల నుండి 7-30ని॥ల వరకు శ్రీమాతాజీ మరియు మహాత్ముల ప్రవచనములు.

రా. 7-30ని॥ల నుండి 8గం. వరకు మహామంగళహారతి, దర్బారు.

విశేష కార్యక్రమములు -

1. ది. 12-8-2016 నుండి 24-8-2016 వరకు శ్రీ శ్రీరామం (పావులూరు) వారి అధ్యక్షతలో మరియు శ్రీ మేటపల్లి వెంకటేశ్వరరావు గారి ఆధ్వర్యములో శ్రీ అవధూతేంద్ర భక్తమండలి, అడవికొలను మరియు ఏలూరు (ప.గో.జిల్లా) సభ్యులచే అఖండ హరినామ సంకీర్తన.

2. 12-8-2016 శుక్రవారం మ. 12గం.లకు సామూహిక వరలక్ష్మీ పూజలు. మ. 3-30ని॥లకు లక్ష్మీ హోమం

3. 15-8-2016 సోమవారం ఉ.8గం.లకు సామూహిక రుద్రాభిషేకములు, మ. 3-30ని॥లకు రుద్రహోమము.

4. 16-8-2016 మంగళవారం ఉ. 8గం.లకు సామూహిక ఆంజనేయ స్వామి పూజలు, మ. 3-30ని॥లకు మన్యుసూక్త హోమము.

5. 18-8-2016 గురువారం ఉ. 8గం.లకు సామూహిక గురుపూజలు, మ. 3-30ని॥లకు సద్గురు హోమము.

6. 19-8-2016 శుక్రవారం ఉ. 8గం.లకు శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి

అమ్మవారి సామూహిక కుంకుమపూజలు, మ. 3-30ని॥లకు లలితా సహస్రనామ హోమము.

7. 23-8-2016 మంగళవారం ఉ.8గం.లకు సామూహిక హనుమాన్ చాలీసా 108 పారాయణలు, మ. 3-30ని॥లకు ఆంజనేయ మూలమంత్ర హోమము. సా. 6గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

8. 24-8-2016 బుధవారము ఉ. 9గం.లకు పూర్ణాహుతి, మహా మంగళ హారతి.

గమనిక - కార్యక్రమములలో సమయానుకూలముగా మార్పులు చేర్పులు వుండవచ్చు. దయతో సహకరించవలెను. ఆశ్రమమునకు ఇచ్చు విరాళములకు ఆదాయపు పన్ను చట్టము సె. 80G రాయితి లభించును.


శ్రీకాళీ వన ఆశ్రమము

SRI KALI GARDENS ASHRAMAM

నంబూరు రైల్వేస్టేషన్ ఎదురుగా,

గుంటూరు - విజయవాడ జాతీయ రహదారి,

పోస్టు నంబూరు, పెదకాకాని మండలం,

గుంటూరు జిల్లా - పిన్.కోడ్ 522 508

కార్యక్రమ వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. -
0863-2293564, 2293109 ; సెల్ నెం. - 94404 00100,
90303 81999, 93976 01237, 93465 35357, 83330 67877




# దురాశ

పూర్వం రామశర్మ అనే బీద బ్రాహ్మణుడు దారిద్ర్య బాధను తట్టుకోలేక, బ్రహ్మను గూర్చి తపస్సు చేశాడు. చాలా కాలానికి బ్రహ్మ ప్రత్యక్షం అయ్యాడు.



"బ్రహ్మదేవుడా! నీవు భక్తసులభుడివి అంటారే! మరి ప్రత్యక్షం కావటానికి ఇంత కాలం పట్టిందేల?" అని రామశర్మ బ్రహ్మను అడిగాడు.

"వత్సా! కాలమానం వేరు. మీకు ఒక యుగమైతే, నాకు ఒక్క రోజు. నేను నీ దగ్గరకు ఒక్క క్షణంలోనే వచ్చాను" అన్నాడు బ్రహ్మ.

రామశర్మ కొంచెం సేపు ఆలోచించి, "స్వామీ! మాకు కోటి రూపాయలు అయితే మీ లెక్కలో ఎంత?" అని అడిగాడు బ్రహ్మను.



"ఒక్క పైస" అన్నాడు బ్రహ్మ.

"అయితే నాకు నీ పైసా ఒకటి ఇప్పించు స్వామీ!" అన్నాడు రామశర్మ.

"ఒక్క నిమిషంలో తెచ్చి ఇస్తాను వుండు" అని చెప్పి అదృశ్యమయ్యాడు బ్రహ్మదేవుడు!!

# శ్రీ హనుమత్కాళీ ప్రసాద చూర్ణికా స్తోత్రమ్

- పాలూరి కాళీప్రసాద్ U.S.A

**శ్రీమ దఖిల భువన సముద్ధరణ కేళీవిలాస భాసమాన కాళీ పరదేవతా దివ్య చరణారవింద సేవావరిలబ్ధ సర్వతోముఖ సంశ్రితావనోద్యోగ లీలా వినోదితానంత కళ్యాణ గుణాలయం, దయా నిలయం।**

మంగళకరులైన శ్రీగురుదేవులు ఈ సమస్త లోకాలలోని సకల జీవులను సముద్ధరించి వారికి, సర్వోత్కృష్టమైన మోక్ష సామ్రాజ్యాన్ని ప్రసాదించే దివ్యలీలా విలాసంతో ప్రకాశించేవారు. తమను ఆశ్రయించిన సకల జనుల యొక్క సర్వతోముఖమైన రక్షణ అనే లీల, శ్రీకాళీ పరదేవత యొక్క దివ్య చరణారవిందముల సేవకు ప్రతిఫలంగా వారికి లభించిన సేవగా భావించి, అందులో అంతులేని ఆనందాన్ని పొందుతూ వుంటారు శ్రీ గురుదేవులు. ఇట్టి అనంత కళ్యాణ గుణాలకు నిలయమైన శ్రీగురుదేవులు పరమమైన దయకు నిలయమైనవారు.

**వేద చోదిత సకల ధర్మాధర్మ నిరూపణ సమర్థతా విభవ విస్తార నిస్తుల ప్రశస్త వాగమృతధారా పరిషక్తమాన భక్తజన మనోవీథీ ప్రతిబింబిత కాళీ పరాంబికా స్వరూపం, సముత్పాటిత భవ సంతాపం।**

వేదములచే ప్రతిష్ఠింపబడిన, సకలమైన ధర్మాధర్మములను నిస్సంశయంగా నిరూపించగలిగిన శ్రీగురుదేవుల సమర్థతా వైభవము లోకమంతా విస్తరింపబడినది కదా! వారి యొక్క సాటిలేని ప్రశస్తమైన దివ్య వాక్కుల యొక్క అమృత వర్షధారలలో స్నానమాడిన ప్రతి భక్తుని మనోమందిరంలో, శ్రీకాళీ పరాంబిక యొక్క ప్రతిబింబంగా శ్రీగురుదేవుల దివ్య స్వరూపమే విరాజిల్లుతూ, ఆ యా జీవులయొక్క సాంసారికమైన సర్వతాపములను సమూలంగా తొలగిస్తూ ఉంటుంది.

**శాశ్వతానంద సంధాన నిపుణ వచన రచనా కౌశల ప్రబోధ ప్రదర్శన మూలక పవిత్రీకృత సకల చరాచర భూతజాలం, సామగానలోలం।**

శ్రీ గురుదేవుల ద్వారా వచన రూపంలో కానీ, రచన రూపంలో కానీ వచ్చే ప్రతి బోధ మనకు శాశ్వతమైన ఆనందాన్ని, అనగా మోక్ష సామ్రాజ్యాన్ని ప్రసాదించే నైపుణ్యాన్ని కలిగి వుంటుంది. అంతేకాక వారి నుండి వచ్చే ప్రతి శబ్దము పరమ పవిత్రమై, శబ్దానికి ఆధారమైన ఆకాశాన్ని, తద్వారా పంచమహా భూతములను పవిత్రమొనర్చి, ఫలితంగా సకల చరాచర భూతజాలాన్ని పరమ పవిత్రులుగా మార్చివేస్తుంది. సామవేదం నుండి ఉద్భవించి, భగవంతుని చేర్చే అత్యంత సులభ సాధనమైన సంగీతం శ్రీగురుదేవులకు అత్యంత ప్రియమైనది.

**రాజయోగాది మహాసాధన పటిష్టతా ప్రసాదిత దివ్యానందానుభవ సంకలిత మోక్షలక్ష్మీ కరగ్రహణ కారణ భక్తిజ్ఞాన వైరాగ్యాది మహాభాగ్య పరిపూర్ణతా విరాజమాన సాధక సాధుహృత్పద్మ సింహాసనాధిష్ఠిత పరమాత్మ వస్తునామక పరంజ్యోతి స్వరూపం, దీనజన రక్షణాటోపం।**

పటిష్టమైన రాజయోగాది మహా సాధనలచే ప్రసాదింపబడిన దివ్యమైన ఆనందాన్ని నిరంతరం అనుభవిస్తూ తద్వారా మోక్షలక్ష్మిని పొందించే భక్తి జ్ఞాన వైరాగ్యములనే మహాభాగ్యములతో పరిపూర్ణంగా నిండిపోయి ప్రకాశించే, సాధువుల సాధక హృదయ పద్మమనే సింహాసనాన్ని అధిష్ఠించి, పరమాత్మ వస్తువని అందరిచేత పిలువబడే పరంజ్యోతి స్వరూపులు శ్రీగురుదేవులు. వారు దీనజన రక్షణమే ముఖ్యంగా అవతరించారు.

**బహుళ తాపత్రయ పరిహారక శ్రీరామ తారక నామామృత రసాస్వాదన పరితృప్త హృదయారవింద కందళిత ధీరతా నిగృహీత కందర్ప దర్పైవ విచిత్రం, కందర్ప పరశురామాభిమానపుత్రం।**

శ్రీ కందర్ప పరశురామయ్యగారికి అభిమాన పుత్రులైన శ్రీగురుదేవులు, అనేక తాపత్రయాలను పరిహరించే శ్రీరామ తారక నామామృత రసాన్ని సర్వదా ఆస్వాదిస్తూ, అందులో పూర్తిగా తృప్తి పొందిన హృదయ కమలము కలిగినవారు. అందువలనే దేవతలను కూడా

మోహంలో పడవేయగల మన్మథుని గర్వాన్ని కూడా శ్రీ గురుదేవులు అత్యంత విచిత్రంగా ఓడించగల ధీరులు వారు.

**సమాశ్రిత సద్భక్త చకోర నికరానందదాయక మందస్మిత సుందర వదనేందుబింబం, చరణాక్రాంత సమస్తాధ్యాత్మ విద్వజ్జనకదంబం।**

చకోర పక్షులకు పున్నమినాటి చంద్రబింబం ఎంతో ఆనందాన్ని కలుగజేస్తుంది. కానీ, ఆ ఆనందం తాత్కాలికమైనదే. అయితే తమను చక్కగా ఆశ్రయించిన సద్భక్తులనే చకోరాలకు నికరమైన (శాశ్వతమైన) ఆనందాన్ని ప్రసాదిస్తుంది శ్రీగురుదేవుల ముఖబింబ దర్శనం. ఆ విధంగా ఆధ్యాత్మవిద్యలో విద్వాంసులైన సమస్త జనుల సమూహాలచే ఆశ్రయింపబడిన చరణ కమలములు కలవారు శ్రీగురుదేవులు.

**సమర్థ సద్గురు శ్రీ హనుమత్కాళీ ప్రసాదం। సమున్మూలిత నాస్తికవాదం। భజేహం భజేహం, భజేహం.**

నాస్తిలోనే అస్తి కూడా ఉన్నదని నిస్సంశయంగా నిరూపించి, నాస్తికవాదాన్ని సమూలంగా పెకలించివేసిన సమర్థ సద్గురుదేవులైన శ్రీహనుమత్కాళీ ప్రసాద దేవులను ఎన్ని విధములుగా కీర్తించినా, సేవించినా అది తక్కువే అవుతుంది.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ భక్తులు సుతాపల్లి వరదరావుగారు (కాకినాడ) గత కొద్ది సంవత్సరాలుగా ఆశ్రమస్థిర నివాసులు 10-7-2016 ఆదివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 65సంవత్సరాలు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

(గత సంచిక తరువాయి) **యోగవాశిష్ఠము** - సుషుమ్నా ప్రసాద

## భాసుడు, విలాసుల కథ

వశిష్ఠ మహర్షి యిలా కొనసాగించారు, “ఓ రఘువీరా! కోరికలనే తాడుతో బంధింపబడి, బాధలకు హేతువైన మనసు, ఆత్మ జ్ఞానము వలన మాత్రమే ఛేదింపబడ గలదు. ఎవరి మనసైతే భౌతికాకర్షణలకు లోనుకాకుండా పవిత్రంగా వుంటుందో, అట్టి వ్యక్తి యెన్ని ప్రాపంచిక కర్మలను చేస్తున్నా యెన్నడూ బంధింపబడడు. భౌతికాకర్షణలకు లోనై, అపవిత్రమైన మనసుగల వ్యక్తి, యెన్ని కఠిన నియమాలు పాటించినా, బంధ విముక్తుడు కాడు. ఎట్టి ప్రాపంచికాకర్షణలకు, బలీయమైన కోరికలు, ఆరాటములకు లోనుగాని పవిత్రమైన మనసు గల వ్యక్తి నిష్ఫలాపేక్షతో నిష్కామంగా కర్మ చేస్తాడో, అతనాకర్షణా రహితుడై నటిస్తూ, ఆనందిస్తూ వుంటాడు.



అప్పుడు రామచంద్రుడిలా ప్రశ్నించాడు, “పూజ్య గురుదేవా! ఆకర్షణ అంటే యేమిటి? ఆకర్షణ రాహిత్యమంటే యేమిటి, ఒక వ్యక్తిని బంధానికి దారితీసే ఆకర్షణ యేమిటి? స్వేచ్ఛను ప్రసాదించే, ఆకర్షణా రాహిత్యమేమిటి? ఈ బంధాన్ని నేనెలా ఛేదించగలను? ఈ ప్రశ్నలకు, చక్కటి వివరణ యిచ్చి, నన్ను సంతృప్తిపరచండి”.

వశిష్ఠ మహర్షి యిలా సమాధానం చెప్పాడు “ఎవరైతే యీ దేహము శాశ్వతమని నమ్ముతాడో, ఎవరైతే శరీరానికి, శరీరానికి కదలిక ఇచ్చి, నిత్యమైన చైతన్యమనే అంతర్యామికి వున్న తేడాని గుర్తించలేక, ఎల్లప్పుడూ శరీరాన్ని గురించి ఆలోచించేవాడు, ఆకర్షణలకు బంధింపబడి, ఆకర్షణలకు బానిస అవుతాడు. అలా బంధించేదే ఆకర్షణ, అది నిస్సందేహంగా బంధానికి దారి తీస్తుంది, ఉన్నదంతా కేవలము బ్రహ్మ లేక ఆత్మయనే నమ్మకము, యీ విశ్వంలో ప్రేమించటానికి, ద్వేషించటానికేమి లేదనే నమ్మిక ఆకర్షణా రాహిత్యము. ఈ ఆకర్షణా రాహిత్యము ముక్తి లేక స్వేచ్ఛకు దారి తీస్తుంది.”

“జీవన్ముక్తులు ఆకర్షణారహితులు, ఆకర్షణారాహిత్య స్థితిలో,

మనసు ప్రాపంచిక సుఖాలను వదిలివేస్తుంది, అహంకారమదృశ్య మవుతుంది. వస్తువుల పట్ల అనుబంధము నశిస్తుంది, ఆకర్షణా రాహిత్య స్థితి మోక్షమునకు దారి తీస్తుంది, ఆకర్షణా విముఖులు కర్మఫలితాన్ని ఆశించరు, విసర్జిస్తారు, కర్మ, అకర్మలు రెండింటికి విలక్షణంగా వుంటారు ఆకర్షణ పునర్జన్మకు దారి తీస్తుంది."

"ఆకర్షణ రెండు రకాలు ఒకటి బంధించేది, రెండవది బంధ రహితము చేసేది, బంధించే ఆకర్షణ అజ్ఞానులకు సంబంధించింది, బంధరహితం చేసే ఆకర్షణ ఆత్మ సాక్షాత్కారము పొందినవారి కాభరణమువంటిది. వస్తువుల పట్ల వ్యామోహము వలన ఆకర్షణ పునర్జన్మకు దారి తీస్తుంది, కాని ఆకర్షణారాహిత్యము వలన వివేచనా శక్తి ఆత్మ జ్ఞానము లభిస్తుంది."

"బంధరహిత ఆకర్షణతో శ్రీమహావిష్ణువు, సిద్ధుల సమూహము భూమిపై, అనేక కర్మలాచరిస్తూ రక్షిస్తారు, జీవన్ముక్తుడు లోక సంరక్షణార్థమై యెన్ని కర్మలనాచరించినా, వాటితో అతనికెలాంటి అనుబంధముండదు, ఆ వస్తువులతో అనుబంధమున్నట్లు గోచరించినా, అతనా వస్తువుల పట్ల విముఖుడుగానే వుంటాడు. ఆ వస్తువు పట్ల జీవన్ముక్తునకెట్టి ఆకర్షణలేదు. అతని మనసెప్పుడూ పరమాత్మ పైనే లగ్నమయి వుంటుంది, ఈ జగత్తు అనిత్యమని విశ్వసిస్తాడు."

"అతను భవిష్యత్తు పై ఆశతో గాని, వర్తమాన సంపద పైన నమ్మికతో గాని లేక గతంలోని మధురస్మృతులిచ్చిన, ఆనందంతో గాని జీవించడు. నిద్రిస్తున్నప్పుడు, దివ్య జ్యోతి దర్శనంతో మెలుకువగా వుంటాడు, జాగ్రదవస్థలో, నిద్రగాని నిద్ర వంటి నిర్వికల్ప సమాధిలో పూర్తిగా మునిగి వుంటాడు. అన్ని పనులు చేస్తున్నా, యే పని చేయనట్లు నిర్వికారంగా వుంటాడు, అన్ని కర్మలు చేసినా తానే వాటికి కర్తనని తప్పుడభిప్రాయము మాత్రము వుండదు, అతనానందము వస్తే పొంగిపోడు, దుఃఖము వస్తే కుంగిపోడు, అతను పసిపిల్లల్లో పసిపిల్లవాడిగా, వృద్ధుల్లో వృద్ధుడుగా ప్రవర్తిసాడు. అతను యువకుల సమక్షంలో యువకుడిగా, జ్ఞానుల సమక్షంలో గంభీరంగా వుంటాడు, అతను యితరుల, ఆనందాన్ని చూసి పరవశిస్తాడు బాధలో వున్న వారి పట్ల సానుభూతి చూపిస్తాడు."

- సశేషం

# దండధరుడు - దైవభక్తుడు

(పరమార్థ కథల నుండి)

దండధరుడు అనగా యమధర్మరాజు. పూర్వం ఒకానొక భక్తుడు ఏకాంతంగా సాధన చేయ సంకల్పించి, ఒక నదీ తీరంలో చిన్న కుటీరం వేసుకుని, ఫలాదులను తింటూ ధ్యానం చేస్తూ జీవితం గడుపుతున్నాడు.

ఒకనాడు అతనికి అకస్మాత్తుగా ఒక ఆలోచన వచ్చింది. 'బొందితో వైకుంఠం ఎవరూ పోలేరా? ఈ శరీరంతోనే భగవంతుణ్ణి ప్రత్యక్షంగా చూడలేరా? ఏమైనా సరే ఆ పనిని నేను సాధించి తీరాలి. ఆరు నూరైనా సరే ఆ కార్యం సాధించేవరకు నేను వదలను. దానిని నెరవేర్చి తీరుతాను' అని కంకణం కట్టుకుని కూర్చున్నాడు. అకుంఠిత దీక్ష వహించి తపస్సు ప్రారంభించాడు. ఒకరోజు ఆ భక్తుడు ధ్యానమును విరమించి, కళ్ళు తెరిచి చూసేసరికి ఎదురుగా ఒక వ్యక్తి గద ధరించి నిలబడి ఉన్నాడు. భక్తుడికి అత్యాశ్చర్యం కలిగింది. 'ఎవరు నువ్వు?' అని ఆగంతుకుని ప్రశ్నించాడు. వెంటనే ఆ పర్వతాకారం కలిగిన వ్యక్తి 'ఓయీ! నేను యముణ్ణి. నీ ఆయుష్షు తీరిపోయింది. కాబట్టి నీ ప్రాణాలను అపహరించుకు పోవటానికి వచ్చాను' అన్నాడు.

ఆ మాటలు విని భక్తుడు "మహాత్మా! అలాగే కానివ్వండి. కానీ బహుకాలం నుంచి నేను ఒక ఉద్దేశ్యంతో తపస్సు చేస్తున్నాను. దానిని తమరు నెరవేర్చగలరని నా నమ్మకం. శరీరంతో ప్రత్యక్షంగా భగవంతుని దర్శించాలన్నదే నా కోరిక. తమవంటి మహనీయులకు అలవికాని పని ఉండదు. దయచేసి నా కోరిక నెరవేర్చండి" అన్నాడు.

దానికి దండధరుడు సంతోషించి, 'ఓయీ! నీ తీవ్ర తపస్సుకు సంతోషించాను. నీ కోరిక నెరవేరుస్తాను. నా వెంట రా. ఇప్పుడే యీ తనువుతోనే నీకు భగవద్దర్శనం చేయిస్తాను' అన్నాడు.

యమధర్మరాజు మాటలు విని భక్తుడు ఆనందంతో అట్లే వస్తానని చెప్పి యముని అనుసరించి నడువసాగాడు. యముడు గదను ధరించి ముందు నడుస్తుంటే, భక్తుడు వెనుక నడవసాగాడు. కొంతదూరం నడిచాక భక్తుడు యమునితో "మహాత్మా! మీ చేతిలోని గదను చూస్తుంటే, నా గుండె భయంతో బ్రద్దలవుతోంది. నడక తొట్రుపాటు పడుతోంది. దయచేసి ఆ గదను కొద్ది సేపు నాకిచ్చినట్లయితే అది పట్టుకుని నేను నిర్భయంగా మీ వెంట నడుస్తాను" అన్నాడు. యముడు ఆ అమయాక భక్తుని మాటలు విని నవ్వుకుని కొద్దిసేపు

ఆ గద వానికిచ్చినందువల్ల నాకొచ్చిన నష్టమేమి లేదు' అనుకుని గదను ఇచ్చాడు. యముడు ముందు నడుస్తున్నాడు, గద పుచ్చుకుని వెనుక భక్తుడు ఠీవిగా నడుస్తున్నాడు.

ఇంతలో వైకుంఠం సమీపించింది. యముడు భక్తునితో 'నాయనా! ఇది వైకుంఠం. నీవు లోనికి వెళ్ళి భగవంతుని దర్శించుకుని వెంటనే తిరిగి రా. నేను ఇక్కడ బయట నీకోసం ఎదురు చూస్తుంటాను' అన్నాడు. భక్తుడు సరే అని లోపలికి వెళ్ళాడు. అక్కడ విష్ణు దర్శనం చేసి, తన్మయుడై ఒళ్ళు మరచిపోయి, ఆనందబాష్పాలు కారుస్తూ అలాగే ఉండిపోయాడు. ఎంతకీ రావటంలేదని యముడు లోపలికి ప్రవేశించి, సంజ్ఞచేసి పిలిచాడు. కాని భక్తుడు యముని వంక కన్నెత్తైనా చూడక, భగవద్దర్శనానందంలో ఓలలాడుతున్నాడు. ఇక లాభం లేదని యముడు గట్టిగా పిలిచాడు బయటకు రమ్మనమని. ఆ మాటలు విన్న భక్తుడు యమునితో "మహాత్మా! ఇంతటి చక్కటి సన్నిధానం విడిచిపెట్టి నేను ఎలా నీతో రాగలను? నా జీవితం ధన్యమైనది. ఇట్టి స్థానాన్ని విడిచి పెట్టటానికి నాకు మనస్సు రావటం లేదు. నన్ను క్షమించండి. నేను శ్రీమన్నారాయణుని చరణ పంకజాన్ని విడిచి రాజాలను. తమరు దయచేయవచ్చు" అన్నాడు.

ఆ మాటలువిని దండధరుడు ఆశ్చరచకితుడై భక్తుని తన వెంట ఎలాగైనా పంపమని నారాయణునితో మొరపెట్టుకున్నాడు. "ఓ యమధర్మరాజా! నా లోకానికి వచ్చి, నన్ను శరణుపొందిన భక్తునికి మృత్యుభయమెక్కడిది? ఇతడు ఇక్కడే నిత్యానందాన్ని పొందుతాడు కాబట్టి నీవు తిరిగి వెళ్ళవచ్చు" అని చెప్పాడు నారాయణడు. యముడు గత్యంతరం లేక తిరిగి వెళ్ళిపోయాడు. కొంత దూరం వెళ్ళాక తన గద మాట జ్ఞాపకం వచ్చి, వెనక్కి వచ్చి తన గదను తనకు తిరిగి ఇవ్వమని అడిగాడు. "ఈ గద మీకిస్తే మీరు అందరినీ బాధపెడతారు కాబట్టి ఇవ్వను" అన్నాడు ఆ భక్తుడు. శ్రీమహావిష్ణువు ఎలాగో నచ్చచెప్పి ఆ గదను తిరిగి యమునికి ఇప్పించి, "ఓ యమధర్మరాజా! ఇక మీదట ఎప్పుడూ జనుల ప్రాణాలు తీయటానికై వెళ్ళినప్పుడు వాళ్ళను నీవు కనికరించవద్దు. అలా కనికరించనందువలనే నీకు ఈ అవమానం జరిగింది" అన్నాడు. భగవంతుని మాటలు విన్న యమధర్మరాజు (దండధరుడు) ఎవరికి కనిపించకుండా వచ్చి జనుల ప్రాణాలను పెకలించి తీసుకుపోతుంటాడు!!

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

ఆగస్ట్ 2016

01 సోమ : మాస శివరాత్రి., పావులూరు శాఖలో ఏకాహం

02 మంగ అమావాస్య.

05 శుక్ర : శ్రావణ శుద్ధ తదియ- సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

11 గురు : గోదావరి అంత్య పుష్కర సమాప్తి

12 శుక్ర : కృష్ణా పుష్కర ప్రారంభం; వరలక్ష్మీ వ్రతం.

15 సోమః స్వాతంత్ర దినోత్సవం.

18 గురు : రాఖీ పౌర్ణమి, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

25 గురు : శ్రీ కృష్ణ జన్మాష్ఠమి - ఉదయం కలశ స్థాపన; శ్రీరాధాకృష్ణ సహస్రనామార్చన; భక్త సమారాధన; రాత్రి 7గం।లకు శ్రీ సద్గురు పాద పూజ.

26 శుక్ర : ఉదయం 11గం।లకు శ్రీ రాధాకృష్ణ సామూహిక పూజలు, భక్త సమారాధన.

27 శని : శ్రీ గురు దశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన, రాత్రి 7 గం॥లకు ఉట్టి కొట్టుట.

30 మంగ : మాస శివరాత్రి. , పావులూరు శాఖలో ఏకాహం

సెప్టెంబర్ 2016

01 గురు : అమావాస్య.

05 సోమ : టీచర్స్ డే , సిద్ధి వినాయక చవితి - ఉదయం 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ, 11గం.లకు సామూహిక వినాయక పూజలు, భక్తసమారాధన.

16 శుక్ర : భాద్రపద పౌర్ణమి - శ్రీసద్గురు పాదపూజ.

25 ఆది : శ్రీ గురు దశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాద పూజ.

29 గురు : మాస శివరాత్రి,, పావులూరు శాఖలో ఏకాహం

30 శుక్ర : అమావాస్య.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

"భగవంతుడు సర్వవ్యాపకుడు' అని అప్పుడు పుట్టిన పిల్లవాడి తండ్రి కూడా చెబుతున్నాడు. సర్వవ్యాపకుడైన



భగవంతుడు నీలో లేడా! అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరం। తత్పదం దర్శితం యేన తస్మై శ్రీ గురవే నమః - అని నిత్యమూ పారాయణ చేస్తారు. అనుక్షణం ఆయనతోనే ఉండి ఆయన సంరక్షణలోనే పెరుగుతూ ఆయన అనుగ్రహంతో దేహేంద్రియాలు స్పందిస్తేనేగా మానవులు జీవించ గలుగుతున్నారు. మరి ఆయనకోసం ఎక్కడెక్కడో వెతుకుతారు దీనిని ఏమనాలి? అదే వివేకహీనత అంటే. మానవుడు బుద్ధీంద్రియాన్ని కలిగివున్నా, సంస్కారహీనత చేత మనస్సును ఆవరించిన వాసన ప్రభావంచేత గుణహీనుడై ప్రవర్తిస్తాడు.

ఒక తక్కెడ ఉందనుకోండి. ఆ తక్కెడలో సరుకు ఒక ప్రక్కన, తూకపు రాళ్ళు వేరొక ప్రక్కన వేస్తాము. ఏది బరువైతే ఆ వైపు మొగ్గు చూపుతుంది కదా! అలాగే మనో మాలిన్యం బరువైతే వివేకము లేక బుద్ధి పనిచేయదు. దాని ముందు తేలిపోతుంది. ఆ క్షణంలో వివేక శూన్యుడై ప్రవర్తిస్తాడు మానవుడు. మదించిన ఏనుగును చూడండి. భారీ శరీరం కలిగి వుంటుంది. కాని వివేకం శూన్యం. మావటివాడు పన్నిన వలలో చిక్కుకుని గోతిలో పడిపోతుంది. వాడి చేతిలో కీలుబొమ్మ అయిపోతుంది.

అలాగే వివేకశూన్యుడైన మానవుడు ఎంత దేహదారుఢ్యం వున్నా ఏం లాభం బుద్ధిహీనుడై ప్రవర్తిస్తాడు. మదించిన మానవుడికి మాత్సర్యం తోడుగా ఉంటుంది. మూడు లోకాలను జయించి మూడు లోకాలకు అధిపతి అయ్యాడు హిరణ్యకశిపుడు

ఏం లాభం? తనలోని మూడు గుణాలకు దాసుడయ్యాడు. అదే సంస్కారహీనత. అది బుద్ధి హీనుడిని చేస్తుంది. వివేకం కోల్పోతాడు. తన వెంట పెద్ద బలగం వుంది. కాని వివేకశూన్యుడైనవాడికి పతనం తప్పదు.

నారాయణుడు సర్వవ్యాపకుడు అని విన్నాడు. తనలో ప్రకాశించేది ఆ సర్వవ్యాపకుడే అన్న విషయం గ్రహించలేక పోయాడు. స్థంబంలో ఉన్నాడా? చూపించు అంటే అది అవివేకానికి నిదర్శనం. కాని ఆ క్షణంలో వివేకశూన్యుడై ప్రవర్తించటానికి కారణం సంస్కారహీనతే అని గుర్తించాలి.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

ఆగస్ట్ 2016

18 గురు : రాఖీ పౌర్ణమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

25 గురు : శ్రీ కృష్ణ జన్మాష్టమి - రాత్రి 7గం।లకు శ్రీ సద్గురు పాద పూజ; ఉట్టి కొట్టుట.

27 శని : శ్రీ గురు దశమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాదపూజ.

సెప్టెంబర్ 2016

05 సోమ : టీచర్స్ డే , సిద్ధి వినాయక చవితి - ఉదయం 11గం.లకు వినాయక పూజ; శ్రీసద్గురుపాదపూజ.

16 శుక్ర : భాద్రపద పౌర్ణమి - రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ.

# సత్సంగామృతము

-సేకరణ మురళీ

"మనం ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రార్థన, అభిషేకాలు, పండుగరోజులలో పూజలు, తరచుగా పాదపూజలు చేసుకుంటున్నాం. తప్పులేదు. ఇవన్నీ తప్పకుండా చేయవలసినదే. కానీ, ఆయా కార్యక్రమాలు చేసేటప్పుడు, మనసు దానిపై లగ్నం చేసి, గురుదేవుడిని మనస్సులో నింపుకుని చేస్తే కలిగే ఆనందం వర్ణనాతీతం, మనం చేస్తున్న పూజకు సత్ఫలితం. మనం అనేక సత్సంగ కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నాము. సత్సంగంలో మహాత్ములు, అనుభవజ్ఞులు చెప్పిన విషయాలు వింటున్నాం. కాని వాటిని ఎంతవరకు అనుభవంలోకి తెచ్చుకుంటున్నాం? సత్సంగంలో చెప్పిన విషయాలను అనంతరం తిరిగి జ్ఞప్తికి తెచ్చుకుని, వాటిని విచారణచేసి, అనుభవంలోకి తెచ్చుకునే ప్రయత్నం చేస్తేనే సత్సంగం యొక్క ఫలితం. సత్సంగం చేసుకోవటానికి ఎవరో అవసరం లేదు. మనలో మనమే విచారణ చేసుకోవచ్చు. వేరే ఎవరైనా కలిసినప్పుడు మనకు అవసరం లేని పిచ్చాపాటి, పనికిరాని విషయాలు చర్చించే బదులు సద్గురుదేవుల గురించి, వారి బోధ గురించి, భగవద్విషయాల గురించి చర్చించుకుంటే మన సమయం సద్వినియోగం అవుతుంది. ఆధ్యాత్మిక సాధన అభివృద్ధి చెందుతుంది. శ్రీ సద్గురుదేవుల ఆరాధన కార్యక్రమములలో శ్రద్ధగా పాల్గొని మన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

శ్రీగురుదేవులు ఎంతో ఆలోచించి మనకు నిత్యప్రార్థనను (సత్య సుందర స్వరూపుడవైన..) అనుగ్రహించారు. ఈ ప్రార్థన చేసుకునేటప్పుడు మనం పలుకుతున్న ప్రతి మాటని అర్థం చేసుకుని దానిని ఆచరణలో పెట్టాలి. లేకపోతే ప్రార్థన చెప్పుకోవటం వృథాయే కదా!

ప్రతిరోజు రాత్రి విశ్రమించబోయే ముందు విచారణ చేసుకోవాలి. 'ఈ రోజు ప్రార్థనలో చెప్పిన వాటిలో ఏ విషయాలు పాటించాను? ఏ విషయాలు ఉల్లంఘించాను? ఎవరినైనా కష్టపెట్టానా? నా వల్ల ఎవరికైనా అన్యాయం జరిగిందా? ఎవరికైనా సహాయం చేయగలిగానా? ఎంత సమయం సద్గురు ధ్యానంలో గడపగలిగాను?ఎంత సమయం యితరులకు సహాయపడటానికి వుపయోగించాను? రేపటి రోజున నా సాధన ఏవిధంగా అభివృద్ధి చేసుకోవాలి? .......' ఇలా విచారణ చేసుకోవటం మొదలు పెడితే మన సాధన తప్పక మెరుగవుతుంది.

శ్రీసద్గురుదేవుల నుండి ఉపదేశం పొందినవారు, ఆశ్రమంలో స్థిర నివాసం చేసేవారు ఆధ్యాత్మిక సాధన విషయంలో మరింత దృఢంగా వ్యవహరించాలి. వారికి ఎటువంటి రాయితీలు వుండకూడదు. వారే కాదు, సాధన విషయంలో ఎవరూ రాజీపడరాదు. జైగురుదేవ్!" అన్నారు శ్రీమాతాజీ.

## కృష్ణా పుష్కరాల సందర్భంగా
## 13-8-2016 నుండి 24-8-2016 వరకు
## శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం (నంబూరు)లోని
## కార్యక్రమాలలో మార్పులు

1. తె.జా. 4-00గం. నుండి 4-30గం. వరకు మేలుకొలుపు, సుప్రభాతం, నగర సంకీర్తన

2. తె.జా. 4-30గం. నుండి 5-30గం. వరకు వరకు ప్రార్థన.

3. తె.జా. 5-30గం. నుండి 6-30గం. వరకు పూజ్యశ్రీ మాతాజీవారి ప్రబోధము.

4. ఉ. 10-00గం. నుండి 11-00గం. వరకు సంకీర్తన.

5. ఉ. 11-00గం. నుండి మధ్యాహ్నం 12గం. వరకు ప్రవచనం.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

ఆగస్ట్ 2016

18 గురు : రాఖీ పౌర్ణమి, సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన.

25 గురు : శ్రీ కృష్ణ జన్మాష్టమి - సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

27 శని : శ్రీ గురు దశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

సెప్టెంబర్ 2016

05 సోమ : టీచర్స్ డే , సిద్ధి వినాయక చవితి - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

16 శుక్ర : భాద్రపద పౌర్ణమి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

25 ఆది : శ్రీ గురు దశమి, ఉదయం 11గం. సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

# అమ్మంటే అమ్మా కాదూ

- పెనుమాక నాగేశ్వరరావు

అమ్మంటే అమ్మాకాదూ, ఆమ్మంటే ఆమ్మా కాదూ
అవ్యాజ ప్రేమతో అల్లుకున్నా అనుబంధం మాదీ
అభిమానంతో పెంచుకున్నా అనుబంధం మాదీ
భక్తి భావంతో పెనవేసుకున్నా బంధుత్వం మాదీ
భవ బంధం కానీ బంధం మాదీ భగవత్సంబంధం మాది ॥అమ్మ॥

తల్లంటే తల్లీ కాదూ, తోడంటే తోడూ కాదూ
తల్లీ తోడూ కన్నా మిన్నైనా బంధం మాదీ
మళ్ళీ మళ్ళీ కావాలనిపించే కమనీయ బంధం మాదీ
కులదైవం గురుదైవం కలబోసిన బంధం మాదీ
భవబంధం కానీ బంధం మాదీ, భవగత్సంబంధం మాది ॥అమ్మ॥

వేదం అంటే వేదం కాదూ, నాదం అంటే నాదం కాదూ
వేదం, నాదం కలిసిన సమ్మోహన మోదం మాదీ
గురువే దైవం అన్నా గురుతర బంధం మాదీ
గురుతెరిగిన బంధం మాదీ, గురి తప్పని బంధం మాదీ
భవబంధం కానీ బంధం మాదీ, భగవత్సంబంధం మాది ॥అమ్మ॥



# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

(గత సంచిక తరువాయి)

సంధ్యావన్దన భద్రమస్తు భవతే భోః స్నాన తుభ్యం నమో ।
భో దేవాః పితరశ్చ తర్పణవిదౌ నాహం క్షమః క్షమ్యతామ్ ।
యత్రక్వోపి విషీద్య యాదవ కులోత్తం సస్య కంసద్విషః ।
స్మారం స్మార మఘం హరామి తదలం మ్యే కిమన్యేన మే॥

తాత్పర్యము - ఓ సంధ్యావందనమా! నీకు శుభం అగుగాక! ఓ స్నానమా! నీ కొరకు నమస్కారము. ఓ దేవతలారా! పితరులారా! మీకు తర్పణము చేయుట యందు నేను చాలిన వాడను కాను క్షమించండి. ఎక్కడో ఒక చోట కూర్చుండి యదువంశ నాయకుడు శ్రీకృష్ణునే తలచి తలచి నా పాపమును పోగొట్టుకుందును. ఆ హరి ధ్యానము నాకు చాలు అని తలచెదను. ఇతర చింతనలతో పనియేమి?



సుదూర ప్రాంతాలలో వేదాధ్యయనం పూర్తి చేసుకున్న బ్రాహ్మణ వటువు శ్రీరామశర్మ స్వగ్రామానికి తిరిగి వెడుతున్నాడు. ఎంత వడివడిగా నడిచినా వ్రేపల్లె దాపున ప్రవహిస్తున్న యమునా నదీ తీరానికి చేరేసరికి ప్రొద్దుగూక వస్తోంది. సాయం సంధ్యాసమయం పవిత్ర యమునా నదీతీరం ఈ రెంటినీ గమనించి శ్రీరామశర్మ సంధ్యా వందనానికి ఉపక్రమిద్దామని, చంకలో వున్న మూటముల్లె ఎక్కడ పెట్టాలా అని ఆలోచిస్తూ చుట్టూ చూస్తుండగా అల్లంత దూరంలో శాఖోప శాఖలుగా విస్తరించిన పెద్ద వట వృక్షం కనబడింది. అక్కడ ఆలమందలు వాటిని అదిలిస్తూ గోపబాలురు కూడా వున్నారు.

శ్రీరామశర్మ వాళ్ళ దగ్గరకు వెళ్ళి "బాబూ! నేను నదిలో స్నానం చేసి వస్తాను. నా మూటముల్లె ఇక్కడ పెడతాను. కాస్త చూస్తూ వుంటారా?" అని అడిగాడు. దానికి వాళ్ళు తలలు అడ్డంగా ఊపి, "మా గోవుల బిడ్డలు లేగ దూడలు ఆకలితో తల్లికోసం ఎదురు చూస్తూంటాయి. అందుకని గోవులను త్వరగా ఇళ్ళకు తోలుకుని పోవాలి. మరి ఎలాగా?" అన్నారు.

అంతలో వారి మధ్యలో నుండి స్ఫురద్రూపి, తేజస్వి అయిన

ముద్దులొలికే బాలుడు ఒకడు ముందుకు వచ్చి, "ఈ అయ్యవారికి నేను తోడుంటాను. మీరంతా గోవులు తోలుకుని ఇండ్లకు పొండి" అని ఆజ్ఞాపించాడు. శ్రీరామశర్మ వంక తిరిగి "తమరు తమ పని కానివ్వండి. నేను ఇక్కడ మీ వస్తువులన్నీ చూస్తూంటాను" అన్నాడు. ఆ చూపు, ఆ మాట, ఆ రూపం శ్రీరామ శర్మ మనస్సుకు చల్లదనాన్ని ఇవ్వగా, "నా కింత సహాయం చేస్తానన్న నీవెవరు? నీ పేరేమిటి?" అని అడిగాడు. ఆ బాలుడు సమాధానంగా "నేను ఈ పల్లెకు రాజైన నందగోపాలుని బిడ్డను. నన్ను కన్నయ్యా, లేదా కృష్ణయ్యా అని పిలుస్తుంటారు" అన్నాడు చిరుమందహాసంతో. తిరిగి మాట్లాడుతూ "తమరి వివరాలన్నీ తరువాత చెబుదురుగానీ ముందు తమరి పని కానివ్వండి" అంటూ, చేతిలోని మూటను అందుకుంటూ చిగురుటాకులులాంటి తన చేతులను ఆయన చేతికి తగిలించాడు కన్నయ్య. ఆ స్పర్శతో ఒళ్ళంతా జల్లుమంది శర్మకు. తేలికగా ఊపిరి తీసుకుంటూ నీళ్ళలోకి దిగాడు శర్మ ఆనందంగా.

"ఓ పరమేశ్వరా! నా ప్రార్థన ఆలకించు స్వామీ! నీ రక్షణ కోరిన వాడనై వేద మంత్రాలతో నమస్కరిస్తున్నాను. యాగాన్ని అనుష్ఠిస్తూ హవిస్సుల చేత నిన్ను ప్రార్థిస్తున్నాను. వేదమంత్రాల చేత కొనియాడబడే దేవా! నన్ను కరుణించు......." ఇలా ప్రార్థన ముగించి శ్రీరామశర్మ తీరానికి చేరుకున్నాడు కన్నయ్యదగ్గరకు.

కన్నయ్య "అయ్యా! నాదొక మనవి. ఇప్పుడు ఆకాశం నిండా కారుమేఘాలు దట్టంగా కమ్ముకుని ఉన్నాయి. ఉరుములు మెరుపులతో ఆకాశమంతా బీభత్సంగా ఉంది. ఈ సమయంలో తమరు ప్రయాణం చేయటం ప్రమాదకరం. నాతోపాటు మా ఇంటికి రండి. ఈ రాత్రికి విశ్రమించి ఉదయమే లేచి ప్రయాణం సాగించవచ్చు" అన్నాడు. ఇలా కన్నయ్య అంటుండగానే వాన చినుకులు ప్రారంభమయ్యాయి.

శ్రీరామశర్మ కన్నయ్యతోపాటు ముందుకి నడిచాడు. వారిద్దరూ నందుని లోగిలి చేరేసరికి నందయశోదలు వాకిట్లోనే నిలబడి కొడుకు కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు తమ బిడ్డ తడిసిపోతాడేమోనని. కన్నయ్య శ్రీరామశర్మను వారికి చూపిస్తూ "ఈ అయ్య చాలా పెద్ద చదువు చదువుకున్నవారమ్మా!" అన్నాడు. ఆ దంపతులు ఆయనకు సకలోపచారాలు చేసి, పాలు పండ్లు సమర్పించి, నడుము వాల్చటానికి కూడా ఏర్పాటు చేశారు.

- సశేషం

(గత సంచిక తరువాయి) # గీతాధ్యయనమ్ - రమణ ప్రసాద్

## 17. శ్రద్ధాత్రయ విభాగయోగము

భగవానుడు శాస్త్రాదేశాలకు భిన్నంగా ప్రవర్తింపరాదని , శాస్త్ర విధిని ఉల్లంఘిస్తే మోక్షం లభింపదని చెప్పగా, అర్జునునకు ఒక సంశయం కలిగింది. అదేమనగా - "ఎవరైనా శాస్త్ర విధిని విడిచి. శ్రద్ధతో పూజా యజ్ఞాదులు చేసిన వారి స్థితి ఎలా ఉంటుంది? వారి ప్రవర్తన సత్వ గుణ సంబంధమైనదా? లేక రజో గుణ సంబంధమైనదా?లేక తమోగుణ సంబంధమైనదా?" అని. అర్జునుడు భగవానుని ఈ విధంగా ప్రశ్నిస్తున్నాడు:



యే శాస్త్ర విధి ముత్సృజ్య యజన్తే శ్రద్ధయాన్వితాః।
తేషాం నిష్ఠాయ కా కృష్ణ, సత్వమాహో రజస్తమః ॥ 1

" ఓ కృష్ణా! శాస్త్ర విధానాన్ని విడిచి, శ్రద్ధతో పూజ యజ్ఞాలు ఎవరు చేస్తారో, వారి స్థితి సాత్వికమా? రాజసమా? లేక తామసమా?"

శ్రీభగవానువాచ - త్రివిధా భవతి శ్రద్ధా దేహినం సా స్వభావజా।
సాత్వికీ రజసీ చైవ తామసీ చేతి తాం శృణు ॥ 2

భగవానుడు "అర్జునా! ప్రాణుల స్వభావం చేత కలిగిన శ్రద్ధ సాత్వికమురాజసము, తామసమని మూడు విధములు. దానిని గురించి విను. శ్రద్ధ లేనివాడు ఎవడూ లేడు. ఎవరికి ఎలాంటి శ్రద్ధ ఉంటే, వాడు అలాంటి వాడు అవుతాడు. సాత్వికులు దేవతలను; రాజసులు యక్ష రాక్షసులను; తామసులు భూత ప్రేతాలను పూజిస్తారు. శాస్త్ర విరుద్ధంగా ఘోర తపస్సులను చేస్తూ, అవివేకంతో, అంతరాత్మగా ఉన్న నన్ను పీడించే ఆడంబరులు, కామ బల గర్వితులు, అసుర స్వభావం కలిగినవారై ఉంటారు.

మనం తీసికొనే ఆహారం మూడు విధాలుగా ఉంటుంది. అలాగే యజ్ఞ, తపస్సు, దానాలు కూడా మూడు రకాలు. ముందుగా ఆహార భేదాల గురించి చెబుతున్నాను. - ఆయుస్సును, దేహ బలాన్ని, సౌఖ్యాన్ని కలిగించే రసము, చమురు గల ఆహారాలు సత్వగుణం కలవారికి ఇష్టమై ఉంటాయి. చేదు, పులుపు, ఉప్పగాను, మిక్కిలి వేడిగాను, మిక్కిలి కారంగాను, దాహాన్ని కలుగజేసే ఆహారాలు రజోగుణ ప్రియులు

ఇష్టపడతారు. చల్లబడినవి, సారం లేనివి, వాసనలతో కూడినవి, ఎంగిలివి, అపవిత్రము అయిన ఆహారం తామసులు ఇష్ట పడతారు.
<u>యజ్ఞాలలో భేదాలు:</u> ఫలాపేక్ష లేక శాస్త్ర సమ్మతంగా చేసే యజ్ఞం సాత్విక యజ్ఞం; ఫలాన్ని ఆశించిగాని, ఆడంబరం కోసంగాని చేసే యజ్ఞం రాజస యజ్ఞం అంటారు. అశ్రద్ధతో చేసే యజ్ఞం తామస యజ్ఞం అంటారు.
<u>తపస్సులో భేదాలు</u> : - దేవతలను, బ్రాహ్మణులను పూజించటం, పవిత్రంగా ఉండటం, బ్రహ్మ చర్యం, అహింసా దీక్ష అవలంబించటం శరీరంతో చేసే తపస్సు అంటారు. ఇతరులకు బాధ కలిగించకుండా, సత్యం, ప్రియం హితం అయి సంభాషణములనుచేయటం, వేదాధ్యయనం చేయటం - వాక్కుకు సంబంధించిన తపస్సు అంటారు. మనస్సును నిర్మలంగా ఉంచుకోవటం, మౌనం, శాంత స్వభావం, ఆత్మ నిగ్రహాన్ని , అంతఃకరణ శుద్ధి కలిగి ఉండటం మనస్సుతో చేసే తపస్సు అవుతుంది. పరమ శ్రద్ధతో, ఫలాపేక్ష లేకుండా ఈ మూడు విధాల తపస్సు చేస్తే, అది సాత్వికమని చెబుతారు. సత్కారం, సన్మానం, పూజలు పొందటం కోసం ఆడంబరంగా చేసే తపస్సు రాజసం అంటారు. మొండి పట్టుదలతో శరీరానికి బాధ కలిగేటట్లుగా గాని, ఇతరులకు హాని తలపెట్టేది గాని చేసే తపస్సు తామసమవుతుంది.
<u>దానంలో భేదాలు :</u> దానం చేయటం కర్తవ్యంగా భావించి, యోగ్యతను గమనించి చేసే దానం సాత్వికం. ప్రత్యుపకారం పొందే ఉద్దేశంతో గాని, ప్రతి ఫలాన్ని ఆశించిగాని, మనసులో బాధ పడుతూ చేసే దానం రాజసం. అనువు కాని చోట, అకాలంలో, అపాత్రుడికి , అగౌరవంగా, అవమానపరంగా ఇచ్చే దానం తామసం.

ఓంతత్సదితి నిర్దేశో బ్రహ్మణ స్త్రివిధ స్మృతః।
బ్రాహ్మణా స్తేన వేదాశ్చ యజ్ఞశ్చ విహితా పురాః ॥

పరబ్రహ్మకు 'ఓమ్' అని; 'తత్' అని; 'సత్' అని మూడు విధములైన పేర్లు చెప్పబడ్డాయి. ఈ నామత్రయం వల్లనే బ్రాహ్మణులు, వేదాలు, యజ్ఞాలు సృష్టించబడ్డాయి. అందువలన వేద వేత్తలు శాస్త్రోక్తంగా చేసే యజ్ఞాలు, దానాలు, తపస్సులు ఎప్పుడూ 'ఓమ్' అని చెప్పిన తరువాతే ఆరంభిస్తారు. మోక్షాన్ని కోరేవాళ్ళు ఫలాపేక్ష లేకుండా యజ్ఞాలు, దానాలు, తపస్సులు 'తత్' అనే శబ్దాన్ని ఉచ్చరించిన అనంతరమే చేస్తారు. ఉనికి, ఉత్తమం - ఈ రెండు అర్థాలతో'సత్' అనే పదాన్ని వాడతారు. యజ్ఞ దాన తపః కర్మలు అశ్రద్ధగా చేస్తే, వాటిని 'అసత్' అంటారు. వాటికి ఇహ పరాలలో ఏమీ ఫలితం ఉండదు.

(గత సంచిక తరువాయి) **గౌతమ మహర్షి** - రమణ ప్రసాద్

అహల్య వివాహమైనప్పటినుండి ఇంద్రుడు ఆమె లోకాతీత సౌందర్యానికి వశుడై ఆమె పొందుకోరుతున్నా, అహల్య పాతివ్రత్యానికి వెరచి ఉన్నాడు. తన కామవాంఛ తీర్చుకోవటంకోసం ఒక ఉపాయం ఆలోచించి కోడి రూపాన్ని ధరించి అర్ధరాత్రి సమయాన కూయటం మొదలు పెట్టాడు. ఆ కోడికూత విని గౌతముడు కాలకృత్య నిర్వహణకై నదీ తీరానికి వెళ్ళాడు. ఆ అవకాశమును పురస్కరించుకొని ఇంద్రుడు గౌతముని రూపం ధరించి ఆశ్రమంలోనికి వచ్చి ఆమె పొందు కోరాడు.ఆ వచ్చినది తన భర్తగా భావించి ఆమె అంగీకరించింది.



వారు కామకేళిలో మునిగియుండగా, నదీ స్నానానికి వెళ్ళిన గౌతముడు ఇంకా చాల పొద్దు ఉంది అని ఆశ్రమానికి తిరిగి వచ్చి లోనికి ప్రవేశించగానే అహల్య ఆశ్చర్యపడి, "మహాత్మా! ఇంతవరకు మీరు నాతోనే ఉన్న మీరు రెండు రూపాలను ఎందుకు ధరించారు?" అని ప్రశ్నించింది.

ఇంద్రుడు వణికిపోయి పిల్లిరూపంలో బయటకు పోవటానికి ప్రయత్నించాడు. గౌతముడు ఆ పిల్లిని చూసి,"ఓరీ! నీ వెవ్వరు? నిజంచెప్పకపోతే నిన్ను దగ్ధంచేస్తాన"నగా, ఇంద్రుడు నిజ స్వరూపాన్ని ధరించి క్షమాభిక్ష వేడాడు.

అహల్య ఆశ్చర్యభరితయై,"మహాత్మా! పంచ భూతాల సాక్షిగా ఈ మోసం నాకు తెలియదు" అని శపథం చేసింది. గౌతమ మహర్షి,"నీవు తెలిసి చేసినా, తెలియక చేసినా దోషం దోషమే. తెలియక నిప్పును తాకితే కాలకుండా ఉంటుందా? నీవు చైతన్యహీనవై శిలగా పడి వుండమ"ని శపించి, ఇంద్రుని చూసి,"ఓరీ! నీచుడా! మహా పతివ్రతయైన

అహల్యను మోసగించావు. నీ శరీరమంతా యోనిమయమై నీవు నిత్యఖేదమందెదవు గాక! నీవు పదభ్రష్టతనంది దైన్యమైన జీవితమును గడిపెదవు గాక!' అని తీవ్రంగా శపించాడు.

అప్పుడు వారిరువురూ శాప విముక్తిని కోరగా, గౌతముడు అహల్యవైపు చూసి, "పాపాత్మురాలా! నీవు శిలవై రామ స్మరణ చేస్తూ సహస్ర వర్షాలు తపింపుము. ఆ ఆశ్రమం ఇక నిర్మానుష్య మయిపోతుంది. శ్రీరాముని పాద పుంజములు నీ శిరస్సు పైన పడగానే నీకు శాపవిముక్తి కలుగుతుంది" అన్నాడు. ఇంద్రుడిని చూసి," పాపాత్ముడా! నీపై నాకు కరుణ కలిగింది. నీ యోనులు ఇతరులకు కన్నులవలె కనిపిస్తాయి. నీవు పదభ్రష్టుడవైనా కొంతకాలానికి  స్వపద ప్రాప్తి పొందుతావు" అని శాపవిముక్తినొసగి హిమగిరిలో తపస్సు చేస్తూ ఉండిపోయాడు.

కాలక్రమంలో శ్రీరాముని పాద రజం సోకగానే అహల్య శాప విముక్తురాలై స్త్రీ  రూపాన్ని ధరించి, గౌతమ మహర్షిని చేరి మహా పతివ్రతయై ఆయనను సేవించింది.

గౌతమ మహర్షి లోకానికి  గౌతమ ధర్మ సూత్రాలను ప్రసాదించాడు.  రెండవదియైన గౌతమ న్యాయ శాస్త్రాన్ని అందించాడు. మూడవదియైన జ్యోతిశ్శాస్త్ర గ్రంథాన్ని లోకానికి అందించి లోకోపకార మొనర్చినవాడు గౌతమ మహర్షి సప్తఋషులలో ఒకడు..

## *సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి*

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఆగస్ట్ 2016, సెప్టెంబరు 2016 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

ఆగస్ట్ 2016 : AS 6415, .6418, 6420, 6531, 6898, 6905, 7137, 7138
AS 7145, 7147, 7148, 7149, 7150

సెప్టెంబరు 2016 : AS 2640, 4768, 4811, 6911, 6912, 6914, 7152,
AS 7153, .7158, 7159, 7160, 7164, 7166.

– మేనేజర్

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## కవిగారు - పోతునూరు

ఏనాడేమ భవత్పదాబ్జముల నెంతే బట్టుకొన్నారమో
ఆనాడే చరితార్థ జన్మలమ మేమైనార మెట్లేని,
బాబూ! నీ దృష్టి బడం దృజింప వెటులన్ బోనీక రక్షించి, సు
జ్ఞానంబీగల సత్యమూర్తివి గదా! కాళీప్రసాద ప్రభూ!

ఇది, కవిగారు శ్రీ బాబు అవ్యాజ ప్రేమామృత లహరులలో తేలియాడుతూ తన్మయులైన మధుర క్షణాలలో, వారి లేఖిని నుండి జాలు వారిన శ్రీ హనుమత్కాళీ ప్రసాదాష్టకంలో ఒక పద్యము.



సముద్రంలో మునిగిపోతున్న వాడికి నావ దొరికినట్లు సంసారమనే సముద్రంలో కొట్టుకుపోతున్న వాడికి గురు పాదం దొరికితే, అది అతణ్ణి ఎలాగైనా ఒడ్డుకు చేరుస్తుంది. గురుపాదం ఎంత మహత్త్వ పూర్ణమైనదో తెలియకపోయినా, ఆ పాదమును ఆశ్రయించే విధం తెలియకపోయినా, ఎలాగో ఒకలాగున ఆ పాదమును " ఎంతేని " పట్టుకోగలిగితే, ఆ మహాభాగ్యమే లభిస్తే, యిక తరువాత పని అంతా (మనలను ఉద్ధరించే పని) అదే చేసుకు పోతుంది. అందుచేతనే , ఆ పాదమును పట్టిన "ఆనాడే" చరితార్థ జన్మలమ మేమైనారము "అని కవిగారి నిశ్చయ వాక్యము. దానికి కారణం కూడా "ఎట్లేని, బాబూ! నీ దృష్టి బడన్ త్యజింపవు, ఎటులన్ బోనీక రక్షించి, సుజ్ఞానంబీగల ప్రేమ మూర్తివి గదా" అని కవిగారే చెప్పారు. కవిగారు చెప్పటమేమిటి? శ్రీ బాబే అనేకసార్లు "వీడు కామవరపుకోట జీడి. కామవరపుకోట జీడి ఒకసారి పట్టుకుంటే యిక వదలదు. వీడూ అంతే" అని చెప్పారు. అది సత్యగురువుకు తన శిష్యుని యెడల గల అనన్య ప్రేమ . తమ పాదమును ఆశ్రితులు వెదకి పట్టుకునే శ్రమను కూడా వారికి యీయక, శ్రీ బాబు తామే ఒక అడుగు ముందుకు వేసి, తమ దివ్య పాదమును వారికి అందించి, యిక తరింపజేసే వరకు వారిని వదలనని నిర్హేతుక జాయమాన కరుణా కటాక్షమును వర్షించే సమర్థ సద్గురు మూర్తులు.

“కవిగారూ! ” అని శ్రీ బాబుతో వాత్సల్యంగా పిలిపించుకున్న అదృష్టశాలురు శ్రీ పరిమి సుబ్రహ్మణ్య భాగవతార్‌గారు. వారు గుండుగొలను ప్రక్కనే ఉన్న పోతునూరు గ్రామ వాస్తవ్యులు. హరికథా గానంలో సుప్రసిద్ధులైన ఆదిభట్ల నారాయణదాసుగారి వద్ద హరికథాగాన విద్యను అభ్యసించి, వారితో సమానమైన ప్రతిభాపాటవములను సాధించిన వారు. తమకు దీటుగా రామాయణ కధను వ్రాసి కధా గానం చేయగల వారెవ్వరూ లేరనే స్వోత్కర్ష భావంతో, శ్రీనారాయణదాసుగారు ఒక సభలో “నాతో సమానంగా రామాయణ కధాగానం చేసే వారెవరైనా ఉన్నారా? ” అని ప్రశ్నించినప్పుడు కవిగారు లేచి, వినయంగా నమస్కరించి “గురువుగారూ! తమరు ఆశీర్వదించి, అనుమతిస్తే నేను రామాయణ హరికధా గానం చేస్తాను” అన్నారు. “భేష్! నువ్వు అంతటి వాడివేరా” అని నిరాయణదాసుగారు కవిగారి వీపు మీద ‘తట్టారు’! ఆ సాయంకాలానికే కవిగారి గొంతు పూర్తిగా మూగబోయింది. గొంతు పెగుల్చుకున్నా మాట వచ్చేది కాదు. ప్రసిద్ధులైన ఒక దుర్గా ఉపాసకులొకరికి చూపిస్తే, వారు కవిగారిపై ప్రయోగం జరిగిందని చెప్పి “శూలినీ దుర్గ” మంత్రం కవిగారికి ఉపదేశించి, అనుష్టించుకోమన్నారు. అలా చేశాక వారికి మళ్ళీ గొంతు మామూలుగా వచ్చేసింది.

అప్పటి నుండి శక్త్యుపాశన యెడల కవిగారికి ఎక్కువ నమ్మకమూ, ఆసక్తీ ఏర్పడ్డాయి. గుండుగొలనులో డా॥ శేషగిరిరావుగారితో వారు బాగా సన్నిహితంగా మెలిగేవారు. అప్పట్లో (1946) శ్రీబాబు గుండుగొలను రావటం, శ్రీబాబు సాక్షాద్దేవీ స్వరూపులని, బ్రహ్మజ్ఞాన సంపన్నులని శేషగిరిరావుగారికి గురి కుదరటం జరిగింది. అందుచేత ఒకసారి శేషగిరిరావుగారు కవిగారితో “ఈ మధ్య ఒక బాల సాధువు గుండుగొలను వస్తున్నారు. వారు జగన్మాత దివ్యదర్శన భాగ్యమును అనుక్షణము పొందుతున్న మహనీయులు. బ్రహ్మతేజస్సంపన్నులు. వారి సన్నిధానంలో మనస్సు అనిర్వచనీయమైన శాంతిని , దివ్యానందానుభూతిని పొందుతున్నది. వారి దర్శనం చేసుకుందాము రండి” అని ఆహ్వానించారు. ఆ విధంగా కవిగారికి శ్రీబాబు దర్శన భాగ్యం మొదటిసారి కలిగింది.

- సశేషం

-గత సంచిక తరువాయి

విష్ణు  కథలు

- రమణ ప్రసాద్

# సూరదాస్

“తల్లి వచ్చి కన్నయ్యా వెన్న తిన్నావా?” అని అడిగింది. వెంటనే “నేను వెన్న తినలేదు” అని జవాబిచ్చాడు. తాను వెన్న తినలేదు అనడానికి బలమైన ఆధారాలను ఆమె ముందుంచాడు. ఆమె నమ్మిందా? సూరదాసు వ్రాసిన ఈ కీర్తనను ప్రతి ఇంట్లో పాడుకుంటూ ఉంటారు.



మయ్యా మోరీ మైనహి మాఖన్ ఖాయో ।

భోర్ భయో గాయన్‌కే పాఛే మధువన్ మోహి పఠాయో ॥

చారి పహర్ బంసీ వట్ భట్క్యో, సాంజ భయే ఘర్ ఆయో ।

మై బాలక్ బహియన్‌కో ఛోటో, ఛీకో కిహి విధి పాయో ।

గ్వాల్ బాల్ సబ్ బైర్ పరోహై, పరవస్ ముఖ్ లపటాయో ।

తూ జననీ మన్‌కీ అతి భోరీ ఉనకే కహె పతియాయో ।

జియా తేరె కఛు భేద్ ఉపజిహై, జాని పరాయో జాయో ।

యహ లే అపనీ లకుట్ కమరియా బహుతోహి నాచ్ నచాయో

సూరదాస్ తబ్ బిహసి యశోదా లై ఉర్ కంఠ లగాయో ॥

“అమ్మా! నాకు వెన్న తినటానికి సమయం ఎక్కడిది! పొద్దుననగా ఆవులతో మధువనానికి పంపుతావు. అక్కడేమో సాయంత్రం దాక బంసీ వనంలో తిరిగి తిరిగి సాయంత్రం ఇంటికి వస్తున్నాను. ”

అని అంటే యశోద నమ్మనట్లుగా ముఖం పెట్టింది. కృష్ణుడు ఇంకొక కారణం ఇస్తున్నాడు-

“అమ్మా నాతోటి గొల్ల బాలురు అంతా నాతో స్నేహం చెయ్యటం

మానేశారు. వాళ్ళే నన్నాట పట్టించాలి అని నా మూతికి వెన్న రాచారు. నేనేమీ ఎరుగను" అని ఇంకా ఇలా అంటాడు-
"అమ్మా, నీవేమో అతి భోళా మనిషివి. ఎవరు ఏం చెప్పినా వింటావు. వాళ్ళ మాటలు నమ్మకు".
"నేను వెన్న తినలేదు అని చెప్తుంటే, ఆమె నమ్మినట్లుగా లేదు" అని కోపం నటిస్తూ కన్నయ్య -
"ఈ చెన్నాకోల, కంబళి తీసుకో. ఎంత చెప్పినా నువ్వు నన్ను నమ్మటం లేదు. ఇంక రేపటినించీ ఆవులను తోలుకు వెళ్ళను" అని, ఇంకా ఇలా అంటున్నాడు-
"నాకు తెలిసిందిలే నీకు నా మీద ఏదో భేదభావం వచ్చింది. నన్ను 'నువ్వు నల్లగా ఉన్నావు. నువ్వు యశోద కొడుకువి కావు. బలరాముడే ఆమె పుత్రుడు" అని నన్ను ఎప్పుడూ ఏడిపిస్తారు.'అందుకే నువ్వు నన్ను పరాయి వాడిగా చూస్తున్నావు." అన్నాడు.ఇంత మాట అన్న కృష్ణుడిని చూసి యశోద ఇంక ఆగలేక-
"కన్నయ్యా నువ్వు వెన్న తినలేదురా!" అని వాటేసుకుంటుంది.
అమ్మ తనను దగ్గరకు తీసుకుంది కదా మరి తను సత్యపరిపాలకుడు కదా. కన్నయ్య అమ్మ ఒడిలో చేరి -
"సున్ మయ్యా మైనహి మాఖన్ ఖాయో" అని
వాదించినవాడు.ఇప్పుడు నిజం ఒప్పుకుంటూ -

"మైనేహి మాఖన్ ఖాయో" అంటాడు.

"అమ్మా నేను వెన్న తినలేదు" అన్నవాడు "అమ్మా నేనే వెన్న తిన్నది" అని నిజాన్ని ఒప్పుకుంటాడు. అని కనులకు కట్టేటట్లుగా సూరదాసు అత్యద్భుతంగా వర్ణించాడు.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL